ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

కథా నిలయం
Entered

సెప్టెంబర్ 25, 2005

అంతుపట్టని పిరమిడ్‌లు... మమ్మీలు

దళితాకాశపు ధృవతార

టర్నింగ్ పాయింట్

రేపు చదవచ్చులే !

క్యాంపస్ చాట్

యువతరమంటే రంటక రంటక రం అనా !

మనసా తెలుసా

(25.9.2005 నుంచి
1.10.2005 వరకు)

హ్యాపీ బర్త్‌డే

ఆహ్వానం పదేళ్ల లోపు చిన్నారులందరికీ ఈ 'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక కింద ఉచితంగా శుభాకాంక్షలు తెలియచేస్తాం. దీనికి మీరు చేయవలసిందల్లా మీ చిన్నారి పుట్టిన తేదీకి 20 రోజులు ముందుగా ఓ కలర్ ఫొటో జత చేసి మీ చిన్నారి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, చిరునామా వంటి వివరాలు పంపడమే. e mail ద్వారా కూడా ఫొటోలు పంపవచ్చు. ప్రజాశక్తి శుభాకాంక్షలతో మీ చిన్నారి పుట్టిన రోజును ఆనందంగా జరుపుకోండి.

పంపవలసిన చిరునామా:
హ్యాపీ బర్త్‌డే, స్నేహ, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం,
1-1-298/4, స్ట్రీట్ నెం. 1,
అశోక్ నగర్, హైదరాబాద్-20
e mail:
happybirthday_prajasakti@yahoo.com

గాయత్రి
4సం॥, 25.9.2001
అలివేలు-రవికుమార్
తూర్పుగోదావరి

డి. లిఖిత్‌రెడ్డి
3సం॥, 25.9.2002
అనూరాధ-శ్రీకాంత్‌రెడ్డి
కూకట్‌పల్లి-హైదరాబాద్

భీష్మబ్రహ్మణి
4సం॥, 25.9.2001
కల్పన-బాలకృష్ణ
నాగర్‌కర్నూలు-మ॥నగర్

అపర్ణ
1సం॥, సెప్టెంబర్-2004
సునీత-ఆంజనేయులు
యంగన్నగారిపల్లి-అనంతపురం

ఆయిషాఖాతున్
2సం॥, 26.9.2003
షంషాద్-జాఫర్‌బేగ్
పీలేరు-చిత్తూరు

సిరితన్మయి
1సం॥, 26.9.2004
శైలజారాణి-శివప్రసాద్
గాడేపల్లి-వరంగల్

కె. సౌజన్య
6సం॥, అక్టోబర్-1999
అనసూయ-సురేష్‌బాబు
బాన్స్‌వాడ-నిజామాబాద్

కె. అలేఖ్య
6సం॥, 30.9.1999
ఉషా-పుల్లారావు
గొల్లనపల్లి-కృష్ణా

మహీధర్‌బాబు
2సం॥, సెప్టెంబర్-2003
సుశీల-బాలకృష్ణ
నెల్లూరు

డి. సుమ
7సం॥, 25.9.1998
మంజుల-శ్రీనివాస్
సిద్దిపేట-మెదక్

డి. వర్షిత్
2సం॥, 30.9.2003
కవిత-చంద్రమౌళి
సిద్దిపేట-మెదక్

శ్రీహిత
రేణుక-మల్లేశం
సిద్దిపేట-మెదక్

జి. భువనేశ్వర్‌గౌడ్
బాలీశ్వరమ్మ-కృష్ణగౌడ్
నాటవెల్లి-మ॥నగర్

వి. స్ఫూర్తి
7సం॥, సెప్టెంబర్-1998
ఉష-వెంకట్‌రావు
వైరా-ఖమ్మం

వి. మేఘన
2సం॥, సెప్టెంబర్-2003
రమ-వీరయ్య
జగన్నాథపురం-నల్లగొండ

డి. స్వాతి యాదవ్
4సం॥, సెప్టెంబర్-2001
విజయకుమారి-నాగేంద్ర
చెన్నూరు-కడప

గ్రీష్మ
3సం॥, సెప్టెంబర్-2002
మంజుల-రామకృష్ణ
నాగర్‌కర్నూలు-మ॥నగర్

దాక్షాయిని-జగదీష్
2సం॥, సెప్టెంబర్-2003
జయలక్ష్మి-రమణ
కొచ్చెర్ల-శ్రీకాకుళం

ఆర్. వినయకుమార్(టింకు)
1సం॥, సెప్టెంబర్-2004
పద్మ-భీమయ్య
కుర్వగూడ-రంగారెడ్డి

జి. చందన
3సం॥, సెప్టెంబర్-2002
నీలారాణి-కృష్ణరాజు
మక్కపేట-కృష్ణా

ఈ వారం అతిథి



మన అతిథి గురించి...

పేరు	:	డాక్టర్ జెట్టి శేషారెడ్డి
పుట్టిన ఊరు	:	కోవూరు, నెల్లూరు జిల్లా
తేదీ	:	10-3-1930
విద్య	:	ఎంబిబిఎస్
వృత్తి	:	డాక్టర్ (డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల సూపరింటెండెంట్)
నచ్చిన వ్యక్తి	:	కీర్తిశేషులు డాక్టర్ రామచంద్రారెడ్డి
నచ్చని అంశం	:	వైద్యరంగంలో వ్యాపారధోరణి
హాబీ	:	వైద్యం చేయడం, పుస్తక పఠనం

అందరూ ఆరోగ్యంగా ఉండాలి

వృత్తిపరమైన నైతిక విలువలు పాటించడం ప్రతి వ్యక్తికీ సామాజిక బాధ్యత. అయితే నేరుగా సమాజంతో సంబంధాలు కలిగిన వృత్తులు కొన్నే ఉంటాయి. వీటిలో విద్య, వైద్యం ప్రధానమైనవి. ఈ రంగాలలో ఉండేవారికి సామాజిక బాధ్యత అధికంగా ఉంటుంది. విద్య సామాజికాభివృద్ధికి మూలమైతే, వైద్యం ఉత్పత్తిని పెంచుకునే దిశగా మనిషి ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఎంతో శాస్త్రీయాభివృద్ధి జరిగింది. శాస్త్రీయ వైద్యవిధానం పట్ల ప్రజలకు నమ్మకం పెరిగింది. ప్రపంచవ్యాపితంగా వలస దేశాలకు స్వాతంత్ర్యం వచ్చాక 1979లో భారత్‌తో సహా 140 దేశాలు '2000 సంవత్సరంనాటికి అందరికీ ఆరోగ్యం' అనే ఒప్పందంపై సంతకం చేశాయి. అయితే 1980 నుండి ఇండియాలో వైద్యరంగాన్ని ప్రయివేటుపరం చేయాలనే భావన మొదలైంది. దీంతో 2000 నాటికి ప్రాథమిక ఆరోగ్యం మినహా 80 శాతానికిపైగా వైద్యరంగం ప్రయివేటుపరమైంది. అందరికీ ఆరోగ్యం అనే నినాదంపోయి కొనగలిగేవారికే వైద్యం అనే వ్యాపారధోరణి ప్రబలింది. ప్రజారోగ్యపరిరక్షణలో మనం అతి చిన్నదేశం బంగ్లాదేశ్‌కన్నా వెనుకబడి ఉన్నాం. విరేచనాలు, శ్వాసకోశవ్యాధులు, జ్వరాలు వంటి చిన్నచిన్న అనారోగ్యకారణాలతో ఇండియాలో ఏటా 15 నుండి 20 లక్షలమంది చిన్నపిల్లల ప్రాణాలుపోతున్నాయి. పుడుతున్న ప్రతి వెయ్యిమంది పిల్లల్లో 94.9 శాతం మంది ఐదేళ్లలోపే చనిపోతున్నారు. ఈ సంఖ్య అమెరికాలో 20కాగా, క్యూబాలో కేవలం ఆరు. అందుకే క్యూబా ప్రపంచానికే ఆదర్శం. శాస్త్రీయ అభివృద్ధి ప్రజలందరికీ ఉపయోగపడడంలేదు. ప్రభుత్వం సమగ్ర ప్రజారోగ్య విధానాన్ని ప్రకటించాలి. చిత్తశుద్ధితో అమలు చేయాలి.

ఈ సంచికలో...

టపా ... 2
టర్నింగ్‌పాయింట్ 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు ... 6
నేర్చుకుందాం..రా! ... 7
క్యాంపస్ చాట్ ... 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14
తెంగ్లీషు ... 20
ఓ ఊరి కథ ... 21

సీరియల్ 12
మాధవి

ఇంకా...

మనసా తెలుసా 3
యువతరమంటే... రంటకరంటకరమ్ అనా!

"ఈ కల నిజం కాకూడదు" కథ 18

ఆరోగ్యం ... 17
పప్పెట్ ఇంటర్వ్యూ ... 19
అవీ... ఇవీ 22
విజ్ఞానవీచిక ... 23
కొత్త పుస్తకాలు ... 24

విలయ కత్రినా..

ఈ వారం స్నేహ సంచికలోని అట్టమీది కథ కత్రినా నీ పేరు విలయమా చాలా బాగుంది. "మహా మేధావులం" అని చెప్పుకుంటూ గర్వపడే అమెరికా పొగరును కత్రినావిలయం అణిచింది. కానీ...ఈ విలయం ఏ దేశానికీ రాకూడదు. "ప్రకృతి ధర్మాన్ని పాటించక పోతే సహించదు" అని చెప్పడానికి ఇదే తార్కాణం. ఎన్నికల ప్రక్రియలో జరిగిన అవకతవకలు చదివాం.

వి. రామచంద్ర, నెల్లూరు.



అద్భుత సంచిక

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం "స్నేహ"లోని ప్రతి శీర్షికా అద్భుతమైనది. ప్రాపంచిక అవగాహనకూ, మానసిక వికాసానికీ, విజ్ఞాన వినోదాలకూ ప్రతిపేజీ అత్యుత్తమమైంది. ఇంత చక్కని పత్రిక చిరకాలం వర్థిల్లాలని కోరుకుంటున్నాం.

డి. భాస్కరరావు, పెద్దపద్మాపురం

చదవకుండా ఉండలేకపోతున్నాం...

"మాధవి" సీరియల్ చాలా బాగుంటోంది. మా హృదయాలను తన వైపు తిప్పుకుంటోంది. ఆదివారం రాగానే పుస్తకం తీసి "మాధవి" సీరియల్‌ను చదవకుండా ఉండలేక పోతున్నాం. ముందు ఏం జరుగుతుందా? అన్న టెన్షన్‌తో ఉక్కిరిబిక్కిరవుతున్నాం. "విజ్ఞానవీచిక"లో వచ్చిన "పాములు నిజంగా పగబడతాయా?" అనే అంశం చాలా బాగుంది. దీనిలో ఇచ్చిన సమాచారం చాలా మందిలో ఉన్న అనుమానాలను తొలగించింది. "రియల్ హీరో" కథ బాగుంది. కొత్త శీర్షికలు వస్తూనే ఉండాలని కోరుకుంటున్నాం.

బి. శేఖర్ బాబు, గోలుగొండ, విశాఖ

చక్కగా...ఒక్క పేజీలో

"కాకిలా కలకాలం బతికడం కంటే...హంసలా ఆర్నెల్లు బతికితే చాలు" అన్న సామెతలా... పదిపేజీల కథకాకుండా...ఒక్కపేజీలోనే కథను వివరించారు. ఈ విధానం చాలా బాగుంది. రియల్ లైఫ్‌కీ, రీల్‌లైఫ్‌కీ ఉన్న తేడాను ఒక్క పేజీలో చాలా చక్కగా తెలియజేశారు. అన్ని రకాల శీర్షికలతోబాటు బాలల కథనూ ప్రచురించడం మాకెంతో ఆనందాన్నిచ్చింది.

కొప్పల కాశీ విశ్వేశ్వరరావు,
మర్రిపాలెం.

మరిన్ని...

స్నేహ మేగజైన్ సర్వాంగ సుందరంగా ముస్తాబై పాఠకలోకాన్ని సమ్మోహితులను చేస్తోంది. ఇందులో ప్రచురిస్తున్న "మాధవి" సీరియల్, "అవీ... ఇవీ", "కథ" చాలా బాగా ఆకట్టుకుంటున్నాయి. మరిన్ని శీర్షికలు ప్రవేశపెట్టి పేజీలు పెంచితే బాగుండేది.

ముట్నూరు ఉపేంద్రశర్మ, తిరుపతి.

ఆసక్తిదాయకం

"స్నేహ" మెంత మధురమో ప్రజాశక్తి ఆదివారం అనుబంధం చదివాక తెలిసింది. "స్నేహ" విజ్ఞాన, వినోదాలతో పాఠకనేస్తాలను ఆకట్టుకుంటోంది. రచనా వ్యాసంగంపై సాహితీ ప్రియులకు ఆసక్తి కలుగజేస్తోంది. ధన్యవాదాలు. "బాలలకథ" బాగుంది.

మమతా రమణ, నిర్మల్, జివి. నరసింహులు,
హైదరాబాద్.

మనసా... తెలుసా?



హిప్నో కమలాకర్

కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్,

ఫోన్ : 9849130141

యువతరమంటే... రంటక రంటక రమ్ అనా!

"నువ్ చేస్తున్నది మంచిపని కాదురా.... ఏది మంచో, ఏది చెడో నువ్వు తెలుసుకుంటూ ఉండాలి"

"నీది మరీ చాదస్తమమ్మా! ఇపుడు కాలం మారిపోయింది. ఈ రోజుల్లో ఇదంతా తప్పకాదు. మా ఫ్రెండ్సందరూ చేస్తున్నారు. నువ్వు మరీ స్ట్రిక్ట్. కాలంతో పాటే మనమూ మారాలి. అర్థంచేసుకో మమ్మీ!"

"అవునురా.... ఎప్పుడూ మేమే అర్థం చేసుకోవాలి. మేం ఏం చెప్పినా నీకర్థం కాదు. మేమూ నీ వయస్సు నుంచి వచ్చినవాళ్లమే. అయినా మనకంటూ కొన్ని విలువలు, నిబంధనలు ఉన్నాయి. అవి ప్రామాణికమైనవి."

ఈ రకపు సంభాషణలు మనకు చిరపరిచితమైనవే. తల్లిదండ్రులు తమ టీనేజీ గురించి చెబుతూ... వాళ్లా వయసులో ఉన్నపుడెంత తెలివిగా ఉండేవారో ఏకరువు పెడతారు. అప్పటిరోజులే వేరనీ, ఆనాటి క్రమశిక్షణ, విధేయత ఇప్పటి కుర్రాళ్లలో లేదనీ వాదిస్తారు. ఇప్పటి పిల్లలు తీరువేరని నొచ్చుకుంటారు. కాలంతో పాటు మారడం తమకిష్టమేనని, అయితే ప్రమాణాలను, విలువలను వదులుకోరాదని అంటారు. తల్లిదండ్రులు తమ ఫ్లాష్‌బ్యాక్‌ను మొదలుపెట్టగానే "ఆపవే తల్లీ. అస్తమానం చెప్పిందే చెప్తావు. ఎప్పుడూ ఒకే కేసెట్టెయ్యకే....వినలేక ఛస్తున్నాం" అంటూ పిల్లలు నిట్టూరుస్తారు. "చెప్పగా చెప్పగా ఏదోకరోజు వింటావని ఓ ఆశ" అంటుంది తల్లి. మిగతావిషయాలలో ఆమె నమ్మకం నిజమౌతుందేమోగానీ, పిల్లలు తమ బుద్ధిని మార్చుకునే విషయంలో మాత్రమిది జరగని పని. తల్లిదండ్రులెన్నిసార్లు చెబితే, అంతెక్కువగా పిల్లలు వాటిని వినకుండాపోతారు. ఈ సమస్య ఈ నాటిది కాదు సుమా!

ఏనాటి నుంచో ఇది ఇంతే

ఈ మధ్య నాగరికత మరీ వెర్రితలలు వేస్తోందనీ, కుర్రకారు పెడదారిపోతోందనీ మనం తెగబాధపడతాం. ఇప్పటి కుర్రాళ్లను ఏవేవి పాడుచేస్తున్నాయని మీరనుకుంటున్నారో, అవి మీ టీనేజ్‌లో ఎలా ఉండేవో గుర్తుతెచ్చుకోండి. 'అప్పుడూ ఇంతే' అని మీరు గ్రహిస్తారు. ఇది ఇటీవల కాలానికే కాదు. ప్రాచీన తరాలవారికీ వర్తిస్తుంది. క్రీ.పూ. 500 సం॥ల కాలంలో, గ్రీకు తత్వవేత్త సోక్రటీస్ టీనేజీ కుర్రాళ్ల గురించిలా అన్నాడు.

"నేటికుర్రాళ్లు లగ్జరీలకలవాటు పడ్డారు. ఈ కాలపు పిల్లలు దురుసుతనాన్ని నేర్చారు. ఆధిపత్యాన్ని వీళ్లు సహించరు. పెద్దవాళ్లంటే వీరికి గౌరవం లేదు. తిక్కతిక్కగా మాట్లాడతారు. పనిచేయడం మానేసి చొప్పదంటుబుర్రలతో కాలం వెళ్లబుచ్చుతారు. వాళ్లు కూచున్నచోటికి పెద్దవాళ్లొస్తే... లేచి నిలబడాలన్న కనీస మర్యాద కూడా తెలియదు. తల్లిదండ్రులతో వాదనకు దిగుతారు. స్నేహితులతో విపరీత ప్రసంగాలు చేస్తారు. అదేపనిగా తింటారు. కాళ్లు టేబులు మీద పెట్టుకుని, విలాసవంతంగా గడుపుతూ, పెద్దవాళ్లందర్నీ నిరంకుశంగా పరిపాలించాలనుకుంటారు. రేపటి జీవితం పట్ల వీరికి బాధ్యతగానీ, లక్ష్యం గానీ లేవు"

పెద్ద వాళ్లంతా "టీనేజీ కుర్రాళ్ళంతా ఇంతే" అంటారు

"విలాస లక్షణాలు కలిగినటువంటి నేటి కుర్రాళ్ల మీద ఆధారపడితే ఇక అంతేసంగతులు. మన భవిష్యత్తు, ఈ దేశప్రజల భవిష్యత్తు గంగలో కలిసినట్టే. వాళ్లూ వీళ్లని కాదు, మొత్తం మీద కుర్రాళ్లంతా ఇలాగే ఉన్నారు. మనం చిన్నపుడిలా ఉండేవాళ్లమా? ఎంతో వినయవిధేయతలతో మసులుకునేవాళ్లం. పెద్దవాళ్లంటే గౌరవం, భక్తి ఉండేవి. కానీ ఈ కాలపు కుర్రాళ్లకు ఒక్క మంచి లక్షణమూ లేదు. వీళ్లు దుండగులు. దౌర్జన్యకర స్వభావులు. వీళ్లకి అసహనం మరీ ఎక్కువ". అని అంటాడు క్రీ.పూ. ఎనిమిదవ శతాబ్దానికి చెందిన గ్రీకు కవి హెసియడ్.

యువతరం పాడయిపోతోందా!

"ఇపుడు ప్రపంచం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. నేటియువతరంలో రేపటి భవిత పట్ల నిర్లక్ష్యం ఎక్కువ. వీళ్లకి ఎంతసేపూ తమగోడే తప్ప, ఇంకేదీ పట్టదు. పెద్దవాళ్లన్నా, తల్లిదండ్రులన్నా వీళ్లకి బొత్తిగా గౌరవం లేదు. ప్రపంచంలోని మూర్ఖత్వమంతా ఈ కుర్రాళ్లలోనే ఉంది. వీళ్లకే అంతా తెలుసని పొగరు". క్రీ.శ 1274లో యుద్ధవీరుడైనటువంటి పీటర్ ది హెర్మన్ కూడా పైవిధంగా అన్నాడు. ప్రాచీనకాలానికి చెందిన మేధావులు, వాళ్ల తరానికి చెందిన టీనేజీ పిల్లల గురించి చేసిన వ్యాఖ్యానాలివి. వీటిని చదివినపుడు మీకేమనిపిస్తోంది. యువతరం ఈనాడేకాదు, తరతరాలనుండి ఇట్లాగే ఉంటోంది. సోక్రటీస్ తన కాలంలోని టీనేజీ కుర్రాళ్లనెలా వర్ణించాడో, 2004 సం॥లోని టీనేజీ పిల్లలూ అలాగే ఉండడం విశేషం. నిజంగా పిల్లలందరూ, తరతరాలుగా మారకుండా ఉంటున్నారా? లేక వారిపట్ల మన పోకడ ఇంతేనా? అన్న విషయం మనమే తేల్చుకోవాలి. ఆధునిక జీవితం యువతరాన్ని పాడుచేస్తున్నదని, ఒకప్పటి రోజులే బంగారమని మనం భావిస్తూంటాం. ఇలా అనుకోవడానికి...బహుశా తరాల అంతరమే కారణమేమో!

*

టర్నింగ్ పాయింట్

నా కత్తి కవిత, ఆ కవితా కత్తికి సంఘంపై ద్వేషం లేదు. దాని విధానంపై ద్వేషం"

దళితాకాశపు ధృవతార

వకుళాభరణం రామకృష్ణ

ఈ నాటి దళిత వాదం, దళిత సాహిత్యం ప్రాచుర్యంలోకి రాక మునుపే గుర్రం జాషువా తన పదునైన కలంతో, స్ఫూర్తిదాయక, సృజనాత్మక కవిత్వాన్ని రచించారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకొన్న జాషువా. దళిత కుటుంబంలో పుట్టారు. కడు పేదవాడు. ఇప్పటికీ గ్రామసీమల్లో భూస్వామ్య సంస్కృతి తాలూకు అవశేషాలు ఆధిపత్యంవహిస్తూ, వర్గరీత్యా, వర్ణరీత్యా సమాజంలో అట్టడుగునవున్న ప్రజానీకాన్ని పీడిస్తూవుండడం గమనిస్తున్నాం. రెండు గ్లాసుల వివక్షతో పాటు, వూరికి దూరంగా వెలివాడల్లో కటిక దారిద్ర్యంతో మగ్గుతున్న అభాగ్యుల జీవితాల దయనీయ స్థితిగతులు చూస్తూనే వున్నాం. విద్యకు, వైద్యానికి సరే, కనీస అవసరాలైన గూడు, గుడ్డకు కూడా నోచుకోని అభ్యాగుల జీవితాలు ఎండమావులుగానే మిగిలిపోతున్నాయి. స్వాతంత్ర్యం సిద్ధించి యాభై యేళ్ళు పై బడ్డాక కూడా ఇలా ఉంటే, వంద సంవత్సరాలకు పూర్వ, సమాజం యే స్థితిలో వుందో, నిమ్న జాతులనబడేవారి జీవన సరళి ఎంత దుర్భరంగా వుండేదో వూహకందని విషయమేమీకాదు. అలాంటి పరిస్థితుల్లో 1895 సెప్టెంబర్ 28 వినుకొండలో జాషువా జన్మించాడు. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి అత్యంత తక్కువ స్థాయిలో వుండగా, సామాజికంగా హీనస్థితిలో ఉంది. అయినా జాషువాకు ... విలక్షణ సంస్కారం అబ్బింది. తల్లిదండ్రుల అంతర్వర్ణ వివాహం వల్ల కావచ్చు లేదా, తన చుట్టూ ఉన్న పరిసరాల ప్రభావం వల్లనూ కావచ్చు. క్రైస్తవ మిషనరీల ప్రభావం, బాల్యంలో తాను నేర్చుకున్న గొల్ల సుద్దులలోని సెక్యులర్ దృక్పథం, పరమత సహనం జాషువా వ్యక్తిత్వంపై చెప్పుకోదగ్గ ప్రభావాన్ని కల్గించాయి. అన్నింటికి మించి, ఆయన వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసినవి మరో రెండు వున్నాయి. ఒకటి, అంటరానితనం, రెండు కటికదారిద్ర్యం. దరిద్రం లోని 'రుచి' ని, అంటరానితనంలోని 'అవమానాన్ని' జాషువా స్వయంగా అతి దయనీయంగా అనుభవించినందువల్లనే, వాటి రాపిడి నుండి ఆయన వ్యక్తిత్వం వికసించింది.

జాషువా ఎన్నో బాధలు పడ్డాడు. కష్టాల కడలిని అలుపెరుగక ఈదాడు... అవమానాలకు గురయ్యాడు. వీటన్నిటిని ఎదుర్కొనే శక్తి తనకు వ్యక్తిగతంగా వున్నా, సమాజం విధించిన అంక్షల వల్ల ధిక్కరించి, తిరుగుబాటు చేయలేక, మౌనంగా భరించాడు. కానీ, జాషువాలో అంతర్మథనం కొనసాగుతూనే ఉంది. కోపం, ప్రతీకారం గూడుకట్టుకొన్నా, ఏం చేయాలో తోచలేదు. తనకు జరిగిన అవమానాల వల్ల, ఎలాంటి మానసిక పరివర్తనకు లోనయ్యాడో. రెండు మూడు ఘటనలు ఆయన జీవితాన్ని ఎలా మలుపు తిప్పాయో చూద్దాం. వినుకొండలో ఒక రోజు నాటక ప్రదర్శన జరుగుతోంది. నాటకాలు, సంగీతం, చిత్రలేఖనం మొదలైన శ్రవ్య, ప్రదర్శన కళల్లో అభినివేశం వున్న జాషువా, నాటకం చూడాలన్న అభిలాషతో వెళ్లాడు. ఉత్సాహంగా , టిక్కెట్టు కొనడానికి వెళ్లి ఇమ్మంటాడు. "నీవు అస్పృశ్యుడివి. నీకు నాటకం చూసే అర్హతలేదు. వెళ్ళిపో అని నిర్వాహకులు అన్నారు. జాషువా పసివయసు, సున్నితమైన మనసు గాయపడింది. కులరక్కసి క్రూరత్వం అర్థం కాని జాషువా ఏడుస్తూ ఇంటికెళ్లాడు. తన దుస్థితికి వ్యాకులపడ్డాడు. ఇంతలోనే మరోఘటన. అది ఒక పండుగ రోజు. తోటి పిల్లలు తలంటు స్నానం చేసి, కొత్త బట్టలు ధరించి, రుచికర వంటకాలు తింటూ, ఆనందిస్తున్నారు. జాషువా, ఆయన తమ్ముడు ఇశ్రాయేలు, ఇద్దరూ తమకు కొత్త బట్టలు కావాలని, తినడాన్కి మిఠాయిలు పెట్టమని అడిగారు. చేతిలో చిల్లిగవ్వలేని తల్లిగుండె తల్లడిల్లింది. అప్పుడా వీధిలో పళ్లెం నిండా తినుబండారాలు పెడుతున్న ఒక అమ్మాయి కొన్ని మిఠాయిలను నేలపై జారవిడుచుకోగా అది చూసిన జాషువా వెంటనే వెళ్ళి వాటిని తీసుకొని తిన్నాడు. ఇది చూసిన తల్లి పుట్టెడు దుఃఖంతో కుమిలిపోయింది. కన్న బిడ్డలకు పండుగనాడు పట్టెడన్నం పెట్టలేకపోయానన్న బాధ ఆమెను దహించివేసింది. ఈ సంఘటన జాషువా వ్యక్తిత్వాన్ని మలచడంలో అప్పటి సామాజిక స్థితిని ఆకళింపు చేసుకోవడానికి తోడ్పడింది. మరో ఘటన కూడా, ఆయన మనో ఫలకంపై చెరగని ముద్ర వేసింది. జాషువా చదువుకొంటున్న బడిలో, తన తరగతిలో నున్న వైశ్యబాలుడిని అనుకోకుండా తాకాడు దీన్నొక మహాపరాధంగా , చేయరాని పాపకార్యంగా భావించారు. అది చూస్తున్న సవర్ణబాలురు వారి ప్రోద్భలంతో, ఆ వైశ్య బాలుడు జాషువాను బలంగా చెంపదెబ్బ కొట్టాడు. అందరూ సంతోషంగా చప్పట్లు కొట్టి గెలిచేశారు. సున్నితమైన జాషువా వ్యక్తిత్వం దెబ్బతింది. తిరిగి కొట్టగలిగిన శక్తి వున్నా, నిగ్రహంగా వుండిపోయాడు. ఇంటికెళ్ళి తల్లితో ఏడుస్తూ చెప్పాడు. తల్లి ఓదార్చింది. ఒళ్ళో పడుకోపెట్టుకొని, తలనిమురుతూ, సమయసందర్భాలను, కాలపరిస్థితులను నెమ్మదిగా వివరించి చెప్పింది. ఈ దేశంలో పంచములకు ఇల్లు, వాకిలి, మానవత్వాల్ని మాత్రమే కాకుండా, తుదకు 'జన్మను' కూడా, సమాజం హుళక్కి చేసిందని తన తల్లి చెప్పిన మాటలను, జాషువా 'నా కథలో' రాసుకున్నాడు.



పై ఘటనలు జాషువాని కలచి వేశాయి. ఆలోచింపచేశాయి. ఆయన జీవితాన్నే మార్చివేశాయి. ప్రతీకార జ్వాలతో వూగిపోయాడు. తమాయించుకొని సామాజిక దురన్యాయాన్ని అర్థం చేసుకున్నాడు. అవమానాలకు ప్రతిగా, కసితో తిరుగు దెబ్బతీయవచ్చు. కానీ అలా చేయలేదు. "దారిద్ర్యాన్ని, కులభేదాన్ని కూడా చీల్చి వేరుమనిషిగా నిరూపించుకోదలిచాను. వాటిపై కత్తి కట్టాను. అయితే నా కత్తి కవిత, ఆ కవితా కత్తికి సంఘంపై ద్వేషం లేదు. దాని విధానంపై ద్వేషం" అని ప్రకటించిన జాషువా తెలుగు సాహిత్యంలో అజరామరంగా నిలిచిపోయాడు.

*

పొలం ఇవ్వాలా ?

నేను పదెకరాల పొలం కొన్నాను. అందులో నాలుగు ఎకరాలు మా అన్నయ్య పేర రిజిస్ట్రేషన్ చేశాను. ఇప్పుడు మా అన్నయ్య ఆ పొలం తనకివ్వాలని అడుగుతున్నాడు. నేను పొలం ఇవ్వాలా? వద్దా? చెప్పగలరు.

పి. శ్రీనివాస్

ఆమనగల్, మహబూబ్‌నగర్

జి.ఎల్.నరసింహారావు,
హైకోర్టు న్యాయవాది

పుట్టిన తేదీ మార్చవచ్చు

మా అక్క గవర్నమెంటు స్కూల్లో నాలుగోతరగతి వరకు చదివింది. తరువాత నేను స్కూల్లో జేరాను. ఐదో తరగతి పూర్తయ్యేవరకు అక్క పేరు మీదే స్కూల్లో చదివాను. నా పేరు మార్చండని పలు మార్లు టీచర్‌తో చెప్పినా పట్టించుకోలేదు. చివరకు 6వ తరగతిలో జాయిన్ అయ్యేముందు రిజిష్టర్‌లో అక్క పేరును రౌండ్ చేసి నా పేరు రాశారు. కాని పుట్టిన తేదీ మార్చలేదు. బోనఫైడ్, టిసి ఇచ్చారు. హై స్కూల్ హెడ్‌మాస్టర్ ఆబ్జెక్షన్ చెప్పారు. స్కూల్ హెడ్ మాస్టర్‌కు తెలియచేశాను. ఎవరూ పట్టించుకోలేదు. నేను ఎం.ఎ. బిఇడి వరకు చదివాను. నాకు గ్రూప్స్ రాయాలనుంది. పుట్టిన తేదీ మార్చకపోవడం వల్ల నేను ఏ పరీక్షలూ రాయలేకపోతున్నాను. మా అన్నయ్య కన్నా నా పుట్టిన తేదీ ఎక్కువగా ఉంది. జనన మరణాల రిజిష్టర్‌లో నా పేర 12.1.1977లో నమోదయ్యింది. స్కూల్ రికార్డులలో అక్క పేరు రౌండ్ చేసి నా పేరు రాసిన ఎవిడెన్సుంది. అడ్మిషన్ రికార్డులో నా పేరు మంజులని ఎక్కడ లేదు. నాకు సలహా ఇవ్వగలరు.

ఆర్.మంజుల, మహబూబ్‌నగర్

రిజిస్ట్రేషను ం చే...

మీరు మీ అన్నయ్య పేరిట రిజిస్ట్రేషన్ ఎందుకు చేశారో చెప్పలేదు. మీ అన్నయ్యకు బహుమతిగా గిఫ్ట్‌గా ఇచ్చి ఉంటే మీరు దీనిని తిరిగి రద్దు చేసే అవకాశం ఉంటుంది. కాని నేరుగా మీరు కొన్న వ్యక్తి నుండి మీ అన్నయ్య పేరిట కొన్నట్లు రిజిస్ట్రేషన్ చేసి వుంటే అతడికే సర్వహక్కులుంటాయి

సివిల్ దావా వేయాలి

మీకున్న ప్రస్తుత సర్టిఫికెట్ల ప్రకారం డిఇఓ గార్ని ఎస్ఎస్‌సి బోర్డు ఎగ్జామ్స్ వారిని ప్రతివాదులుగా చేసి సివిల్ దావా వేసి మీకున్న ఆధారాలను చూపిస్తే కోర్టు తీర్పు ద్వారా మీరు పుట్టిన తేదీని మార్చుకోవచ్చు.



"గ్యారంటీ"

డాక్టరు గారు మెకానిక్‌ని, పిలిపించి రిఫ్రిజిరేటర్ రిపేరు చేయించారు. మెకానిక్ తన పని పూర్తి చేసి రెండు వందల రూపాయలు బిల్ వేసి డాక్టరు గారి చేతికిచ్చాడు.

అరె ! ఇదేమిటి ! బిల్లు రెండు వందలా ?! నేను ప్రతి పేషంట్ వద్ద కేవలం యాభై పుచ్చుకుంటాను. నాకన్నా నీవు నాలుగురెట్లు ఎక్కువగా వసూలు చేస్తున్నావా ?

"మరేంలేదండి ! నేను చేసే పనికి ఫుల్ గ్యారంటీ ఉంటుందండి" ముసిముసిగా నవ్వుతూ చేయిజాపాడు మెకానిక్.

మొహ్మద్ జఫరుల్లాఖాన్.



కె. నిర్మల

ఇలా ఉంటే కొంత మేలు

ఇల్లన్నది ఒక కుటుంబానికెంతో ;ముఖ్యమైంది. అది సొంతిల్లైనా... అద్దిల్లైనా... ఏదైనా సరే... ఆ వాతావరణమెంతో హాయికల్గిం చేట్లుగానూ, సేదతీర్చే ట్లుగానూ, విశ్రాంతి పొందేట్లుగానూ, ఆనందాన్ని చేకూర్చే లాగానూ ఉండాలి. ఉద్యోగం చేసేవారెవరైనా ఇంటికి రాగానే కొంతసమయం విశ్రాంతి తీసుకోవాల నుకుంటారు. ఉద్యోగస్తురాలైన ఇల్లాలికి ఈ వీలుందా? ఆమె ఇంట్లోకి అడుగుపెట్టగానే....స్కూలునుంచి వచ్చిన పిల్లలకు స్నానాలు చేయించటం, వారిచేత హోం వర్కు చేయించడం, వంటపని చేయడంలో నిమగ్నమైపోతుంది. అంటే ఆమెకు విశ్రాంతి తీసుకోవడానికి వీలుండకపోగా... మరింత అలసటకు లోనౌతుంది. పని ఒత్తిడి వల్ల ఆమెకు అసహనం, విసుగు కలుగుతాయి. దాంతో కొన్ని విషయాలపట్ల తీవ్రంగా స్పందించడం వల్ల, చిటపటలాడడం వల్ల ఇంట్లో మనం కోరుకోని, ఆశించని వాతావరణం నెలకొంటుంది. ఇంట్లో సంతోషం, ఉత్సాహం కొరవడతాయి.

పని ఒత్తిడి వల్ల ఆమెకు అసహనం, విసుగు కలుగుతాయి. దాంతో కొన్ని విషయాలపట్ల తీవ్రంగా స్పందించడం వల్ల, చిటపట లాడడం వల్ల ఇంట్లో మనం కోరుకోని, ఆశించని వాతావరణం నెలకొంటుంది. ఇది పోవాలంటే...

ఈ బాధలనుంచి తప్పించు కోవాలంటే... ఒకటే మార్గం... ఇంటిపనుల్లో భార్యకు భర్త సహకరించడం. భర్త కాస్త సాయం చేస్తే చాలు...ఆ ఇల్లాలికి అతని పట్ల ఆదరణ, గౌరవం, ప్రేమ మరింత ఎక్కువౌతాయి. ఫలితంగా ఇంట్లో సుఖశాంతులు నెలకొంటాయి. భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకున్నప్పుడు, ఎదుటివారి శ్రమను గుర్తించినపుడు వారి మధ్య స్పర్థలు చెలరేగవు. ఎక్కువ తక్కువ అన్న బేదభావాలుండవు. ఇటువంటి ప్రశాంతమైన గృహంలో పెరిగే పిల్లలు మానసిక వికాసాన్ని కలిగి ఉంటారు.

భార్యభర్తలిద్దరూ సర్దుబాటుతత్వాన్ని, రాజీపద్ధతిని అల వర్చుకోవాలి. అప్పుడే వారి జీవితం సుఖప్రదమౌతుంది. వారిల్లు నందనవన మౌతుంది. భార్య అభిరు చులను గౌరవిస్తూ, ఆమెతో తన ఆలోచనలను పంచు కుంటూ, ఆమె సలహాలకు విలువిచ్చే పురుషుడు భార్యను సంతోషపెట్టడమే కాకుండా, తనూ ఆనందంగానూ, ప్రశాంతంగానూ ఉండ గలుగుతాడు. అదేవిధంగా భార్యకూడా భర్త ఇష్టానికి ప్రాముఖ్యతనివ్వాలి. అప్పుడే భార్యాభర్తల మధ్య హెచ్చుతగ్గులకు, మనస్పర్థలకు తావుండదు.

"గృహమే కదా స్వర్గ సీమ" అన్నట్లుగా మన ఇళ్లకు నూటికి నూరుపాళ్లూ ఉండవనుకోండి. ఎందుకంటే రోజురోజుకీ ధరలూ, సమస్యలూ పెరుగుతుంటే స్వర్గమూ దాని సీను మన మధ్యతరగతి వారిళ్ల ఛాయలకే రాదుగా. అలా అనుకుంటూ నిరాసక్తిగా ఉండాలనీ కాదు. వాటికి తోడు ఇంట్లో ఉండేవాళ్లం లేనిపోని తలనొప్పులు తెచ్చుకోవడం దేనికి చెప్పండి మరి. ఉన్నంతలో భార్యాభర్తలు, పిల్లలు, అత్తమామలు/అమ్మానాన్నలు సామరస్యంగానూ, అన్యోన్యంగానూ ఉంటే కొంత మేలు. *

నేర్చుకుందాం...రా!

లాంతర్ గ్లాస్‌తో అలంకరణ

అగస్త్యరాజు లక్ష్మి సూర్యకళ
ఫోన్ : 040-55889954

ఈ వారం లాంతర్ గ్లాస్ అలంకరణ ఏ విధంగా చేసుకుంటే బాగుంటుందో చూద్దాం. సహజంగా అందరి ఇండ్లలో కరంటు లేని సమయంలో లాంతర్‌ని వాడటం సర్వ సాధారణమైన విషయం. అయితే కొన్ని సందర్భాలలో లాంతర్ గ్లాసు ఏదో ఒక మూలన పగిలిపోవటం జరుగుతుంది. ఇలా పగిలిపోయిన వాటిని ఏ చెత్త కుండీలోనో వేస్తారు. అలా పారేసే బదులు దాన్ని కూడా షోకేస్‌లో ఒక భాగంగా అలంకరించుకోవచ్చండి. దీనికి పెద్దగా ఖర్చు కూడా ఏమి లేదండి. అదేమిటో చూద్దామా !

దీనికి కావలసినవి ఏమిటంటే ?

1.లాంతర్ గ్లాస్ పగిలినది, లేదా వాడకుండా వృధాగా మూల పడేసినదైనా సరే.
2. 24 సెం.మీ పొడవు, వెడల్పు గల తెల్ల కాగితం
3. కొంచెం పలుపు రంగు
4. కొంచెం బ్రౌన్ కలర్ లేదా ఎల్లో కలర్
5. శుభలేఖలకు ఉండే మెరుపు తాడు, కుచ్చు ఉన్నది
6. సెలోటేపు
7. రెండు నెమలి ఈకలు.



ఇక దీన్ని ఎలా అలంకరించుకోవాలో చూద్దామా !

ముందుగా 24 సెం.మీ తెల్ల కాగితాన్ని రోల్ చేసుకోవాలి. మరీ సన్నగా కాకుండా మరీ లావుగా కాకుండా చుట్టుకోవాలి. ఇలా రోల్ చేసిన తర్వాత ఊడిపోకుండా సెలోటేపుతో లైన్ మొత్తం అంటించాలి. ఇలా తయారుచేసిన రోల్‌కి చుట్టూ గోధుమ రంగు లేదా పసుపు రంగును మొత్తం పూయాలి. ఈ విధంగా చేసిన తర్వాత కొంచెం దూరం దూరంగా అయిదు లేక ఆరు రంధ్రాలుగా నలుపురంగుతో గుండ్రంగా ఉండేలా చుక్కలు పెట్టాలి. దానికి చివరన ఇంతకు మునుపు చెప్పకున్న శుభలేఖ యొక్క మెరుపు తాడును కట్టాలి. ఇప్పుడు అర్థమయింది కదా! ఈ ఫ్లూట్‌ని పిల్లలకి కృష్ణుడు వేషం వేసినప్పుడు కూడా ఉపయోగించుకోవచ్చు. ఇలా తయారు చేసిన ఫ్లూట్‌ని మరియు రెండు నెమలి ఈకలతో కలిపి పగిలిన లాంతర్ యొక్క గ్లాసులో ఉంచి షోకేస్‌లో అలంకరిస్తే అబ్బ ఎంత బాగుందో అంటారు మీరే. లాంతర్ గ్లాసుకి కాగితంతో నెట్‌లాగా చేసి అతికించి కలర్స్ వేసుకుంటే బాగుంటుంది. *



వంచి స్టార్ చేయాలి

అమెరికా వాళ్ళు ఒక రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. ఏం జరిగిందోగాని అది మొరాయించి కూర్చుంది. ఎన్నిసార్లు ప్రయత్నించినా అది అంతరిక్షంలోకి వెళ్లడం లేదు.

అంతలో దారినపోయే దానయ్య విషయం తెలుసుకుని లోపలికొచ్చాడు. "రాకెట్‌ను కొంచెం పక్కకు వంచి స్టార్ చేసి చూడండి" అని చెప్పాడు.

సైంటిస్టులు అతను చెప్పినట్లే చేశారు. ఆశ్చర్యం! రాకెట్ అంతరిక్షంలోకి దూసుకెళ్ళింది. సైంటిస్టులంతా దానయ్యను చుట్టుముట్టారు.

"ఏమిటి రహస్యం" అనడిగారు.

"నా స్కూటర్ స్టార్టవకుంటే నేనూ ఇలాగే వంచుతా " చెప్పాడు దానయ్య తాపీగా

పెండెం జగదీశ్వర్.

సీరియల్

మూలం : అనుపమా నిరంజన

అనుసరణ : వి. నాగరత్న

గతవారం కథలో...
మాధవి ద్వారా తనకు వంశాకురంగా కొడుకే కావాలని అన్నాడు హర్యశ్వుడు. నెలలు నిండిన మాధవికూడా ఆడనలుసు పుట్టి బావుకునేదేముంది...మొగపిల్లాడే పుడితేపుట్టనియ్యమనుకుంది. వసంతోత్సవంలో మాధవి ఆనందవర్ధనుణ్ని చూడగానే ఆమె యుక్తవయస్సుకి సహజంగానే స్పందించింది. దానికే పరపురుషుడిపై మోహభావం కలిగినందుకు భయపడాల్సివచ్చిందేమని బాధపడింది. మహారాజు తన భావాలమీద, తన శరీరంమీద, తనకు కలగబోయే సంతానంమీద ఆధిపత్యానికి ఉక్రోషపడింది.

(12 వ భాగం)

మాధవికిప్పుడు తొమ్మిదో నెల. ఆషాఢమాసం కనుక వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి. దాంతో ఉద్యానవనంలో కాసేపు తిరిగే అవకాశం కూడా లేదు. కనకాంబరితో కబుర్లకు మించి మరే కాలక్షేపమూ లేదు. రాజవైద్యుడు, వృద్ధదాసీల సలహాను అనుసరించి విశాలంగా వున్న అంతఃపురంలోనే అటూఇటూ నడుస్తుంటుంది. ఎంత ఎక్కువగా నడిస్తే కాన్పు అంత సులువౌతుందని వాళ్ళు చెప్పారు.

అలా నడుస్తోంటే కడుపులో బిడ్డ అటూఇటూ కదులుతూ చెక్కిలిగింతలు పెట్టినట్లయింది. ఎప్పుడూ అంతే, ఆ సున్నితమైన కదలిక అద్వితీయంగా వుండి అపురూపమైన అనుభూతినిస్తుంటుంది. ఒక జీవికి తాను జన్మనివ్వబోవడం ఎంత అద్భుతం అనుకుంది మురిపెంగా. పొట్టను మెత్తగా తడుముకుని 'పాపవా, బాబువా? ఎవరైతేనేం నా రక్తమాంసాలు పంచుకుని పెరుగుతున్నావు' అనుకుంది. అంతలోనే 'అమ్మో, ఆడపిల్లయితే కోపంకొద్దీ రాజు విసిరేసినా ఆశ్చర్యంలేదు. అబ్బాయినే పుట్టనీ, ఈ రాజ్యానికి రాజవనీ' అనుకుంది. మరుక్షణం 'నా చిట్టితండ్రీ, నువ్వెలా పెరిగి పెద్దవుతావురా?! నీ ఆలనాపాలనా చూసేందుకు దాసీజనం వుండొచ్చు కానీ ఆత్మీయంగా గుండెల్లో దాచుకునే కన్నతల్లి వుండదురా నీకు. ప్రపంచంలో అన్నిటికంటే ముఖ్యమైంది ప్రేమరా కన్నా. అది లేకపోతే జీవితం ఎంత వెలితిగా వుంటుందో నేను రుచి చూశాను, నీకూ అదే గతి పడుతుందంటే భరించలేకపోతున్నాను. నీ తండ్రి పంచభక్ష్యపరమాన్నాలతో భోజనం పెట్టించగలడు కానీ కన్నతల్లి ప్రేమను ఇవ్వగలడా? నాకు అమ్మ లేదనుకుంటే నా బిడ్డవైన నీకూ అమ్మ వుండదా? అదీ నేను బ్రతికుండీ నీకు దూరం కావడం ఎంత దారుణం?! మనసుకు బాధేసినా, సంతోషం కలిగినా పంచుకోడానికి నేనుండనురా నాన్నా. నీకు గోరుముద్దలు తినిపిస్తూ నీ బుడిబుడి నడకలను, వచ్చీరాని మాటలను చూసి పరవశించే అదృష్టం నాకు లేదు. నా బంగారుకొండా, నీకు ఊహ తెలిశాక నన్ను తలచుకుంటావా? నన్ను చూడాలని కలలు కంటావా? నా వద్దకు రావాలని ప్రయత్నిస్తావా? బహుశా మీ నాన్న అలాంటి ఆలోచనలు రాకుండా పెంచుతాడేమో. నాన్నా, నువ్వు పెరిగిపెద్దయి మహారాజువౌతావుగా, అప్పుడైనా నన్ను చూడాలని ప్రయత్నించి నాకోసం వెతుకుతావా?' అంటూ పుట్టబోయే బిడ్డనుద్దేశించి ఆలోచనల వెల్లువలో కొట్టుకుపోయేసరికి మాధవికి దుఃఖం పెల్లుబికింది.

అంతలోనే అవ్వ, చారునేత్రా గుర్తొచ్చారు. ఇలాంటి సమయంలో వాళ్ళిద్దరూ చెంతనుంటే ఎంత ఆత్మీయంగా చూసుకునేవారు, ఎంత హడావిడి చేసేవారు అన్పించింది. కాన్పువేళ వాళ్ళు తన దగ్గరుంటే ఎంత బాగుండును అనుకుని నిట్టూర్చింది. ఒక్కక్షణం నిర్దయులైన తండ్రి, పినతల్లి కూడా గుర్తొచ్చారు. లోకంలో ఎవరికీ రానంత దుస్థితి తనకు కల్పించిన వారిని

"నల్లరంగు చెవి ఉన్న తెల్లటి గుర్రాలు ఎనిమిది వందలు నాకు గురుదక్షిణగా కావాలి" అన్న గురువు గారి కోరికను ఆ శిష్యుడెలా తీర్చాడో ఈ సీరియల్‌లో చదువుతున్నారు.

తల్చుకుంటే ఏహ్యత కలిగింది.

అలా ఆలోచిస్తూ ఇక నడిచింది చాల్లెమ్మనుకుని వచ్చి పిట్టగోడను ఆనుకుని నిలబడి కొలనులో ఈదుతున్న బాతులను చూస్తూ నిలబడింది. ఇంతలో హర్యశ్వుడు వస్తున్నట్లుగా వందిమాగధుల హెచ్చరికలు వినిపించడంతో అసహనం మరింత పెరిగి మెల్లగా వెళ్ళి పట్టుపరుపుపై పడుకుని కళ్ళు మూసుకుంది.

హర్యశ్వుడు వచ్చి పాదుకలు విప్పి మాధవి పక్కన పడుకుని "ఎంత మురిపిస్తున్నావో తెలుసా?!" అంటూ దగ్గరకు లాక్కోబోయాడు.

అసలే పుట్టబోయే బిడ్డకు దూరమౌతున్నానని మథనపడుతోన్న మాధవికి హృదయం రగులుకుపోగా "దయచేసి నన్ను వదిలి వెళ్ళండి, ఇంక నావల్ల కాదు" అంటూ విడిపించుకుని అక్కణ్ణించి లేచి పరిచారికలు వుండే మందిరంవైపు నడిచింది.

మహారాజు తననెవరు ధిక్కరించినా సహించలేడు. నిండుగర్భిణి కనుక మౌనం వహించాడు కానీ లేకుంటే వూరుకునేవాడు కాదు. కోపంతో వెనుతిరిగి వెళ్ళినవాడు తిరిగి మాధవి దగ్గరకు రాలేదు.

మాధవి రోజురోజుకూ దిగులుగా వుండటం గమనించి హర్యశ్వుడు రాకపోవడంవల్లేమోననుకుని "ఇప్పుడు రాజుగారు మోహినీ దగ్గరికి వెళ్తున్నారమ్మా" అని చెప్పింది కనకాంబరి రహస్యంగా.

మాధవికి ఆగ్రహం ముంచుకొచ్చినా తమాయించుకుంది. 'ఈ రాజుకు ఎందరు ఆడవాళ్ళు కావాలి?! ఇంత ముసలితనం మీదపడినా కూడా కోరికలు తగ్గవా? ఒక నీతీనియమం లేకుండా ఎంతమంది స్త్రీలతో వుంటాడు? ఇంత పిచ్చలవిడి శృంగారమేంటి? తల్చుకుంటేనే జుగుప్స కలుగుతోంది. ఈయనగారికి శరీరమేగానీ మనసక్కర్లేదా? ప్రేమ, ఆప్యాయత అంటే రాజుకసలు తెలుసా? ఏనాడైనా ప్రేమ చూపాడా? కనీసం ఇతర్లనుండి పొందాడా? మహారాణీ అయినా ఈయన్ని ఇష్టపడుతుందా అంటే సందేహమే' అనుకుంది.

కనకాంబరితో ఎంత స్నేహం, ఆత్మీయతాభావం వున్నా సభ్యత అడ్డొచ్చి ఈ మాటలు పైకి అనలేదు.

* * *

ఆవేళ మాధవికి నొప్పులు వచ్చాయి. జీవితంలో ఎన్నడూ అనుభవంలోకి రాని దుర్భరమైన వేదన. కొద్ది నిమిషాల్లో వృద్ధదాసీ రానే వచ్చింది.

నొప్పి ఉధృతంగా వుండటంతో పెద్దపెట్టున కేకలు పెట్టసాగింది మాధవి. మధ్యమధ్యలో అవ్వ, చారునేత్రల పేర్లు జపించసాగింది.

"దాసీ, ఇక నేను బ్రతకను... కనకాంబరీ నిజంగా నేను చచ్చిపోతున్నాను. నా బిడ్డను నేను చూస్తానో లేదో... నేను లేని లోటు రాకుండా జాగ్రత్తగా చూసుకో" అంటూ పదేపదే జాగ్రత్తలు చెప్పసాగింది.

ఇక దాసీ "అలా అరవకు, ఇలా పడుకో, ఇట్లా ముక్కు" అంటూ తన తరహాలో తాను చెప్పుకుపోతోంది.

నొప్పికి తాళలేక కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. పోటు వచ్చినపుడల్లా మృత్యువు కబళిస్తోందనే అనుకుంది. సమయం గడిచేకొద్దీ నొప్పులమధ్య వ్యవధి మరింత తగ్గి ఆ తీవ్రతకు శోకాలు పెట్టసాగింది. ఎట్టకేలకు సుఖప్రసవమై కొడుకు పుట్టాడు. మాధవికి ముచ్చెమటలు పోసి మాగన్నుగా నిద్రపట్టింది.

మగబిడ్డ పుట్టాడనే వార్త క్షణాల్లో అంతఃపురం దాటి నగరమంతా వ్యాపించింది.

హర్యశ్వుడు పరుగున వచ్చి బిడ్డను చూశాడు. కొడుకు పసిమిఛాయలో మెరిసిపోతూ మాధవి రూపురేఖలతో, గొప్ప తేజస్సుతో వెలిగిపోతున్నాడు. ఎర్రటి బట్ట కప్పివుండటాన మరింత తెల్లగా మెరుస్తున్నాడు. వెంట తెచ్చిన సన్నటి వజ్రాలహారం బాబు మెడలో వేశాడు. గుప్పిళ్ళు మూసి పడుకున్న కొడుకును ఎంత చూసినా రాజుకు తనివితీరలేదు.

రాజు వచ్చిన సంగతి తెలుస్తున్నా మాధవికి కన్ను తెరిచి చూడాలనిపించలేదు. అటు ఒంట్లో సత్తువ లేనట్లు అలసట, ఇటు ఈ బిడ్డను



తనకు దక్కనివ్వడనే విరక్తి. అందుకే కదలకుండా అలా మిన్నకుండిపోయింది.

కొద్దిసేపు అలాగే కొడుకును మురిపెంగా చూసుకుని 'తల్లీబిడ్డలను జాగ్రత్తగా చూసుకోమని' దాసీజనాన్ని హెచ్చరించి వెళ్ళిపోయాడు రాజు. ఇక ఆయన చేసిన ఆర్భాటానికి అంతులేదు. సంతోషసంకేతంగా నగరవీధుల్లో ఆహ్లాదకరమైన మృదంగవాద్యాలను ఏర్పాటు చేశాడు. దర్బారులోని అధికారులందరికీ భోజనం పెట్టించి, కానుకలు సమర్పించాడు. పురోహితుడిని పిలిపించి బాబెత్తు బంగారాన్ని బహుమానంగా ఇచ్చి మంచి పేరు సూచించమని అడిగాడు.

"మహారాజా, ఇవాళ భాద్రపద శుక్ల చవితి. జన్మ నక్షత్రం ప్రకారం 'వసుమంతుడు' అని పేరుపెడితే చాలా మంచిది. కుమారరత్నం భవిష్యత్తులో చక్రవర్తయి మీకెంతో పేరు తెస్తాడు" అన్నాడు రాజపురోహితుడు.

ఆ మాటతో రాజు ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ముఖం సూర్యకాంతిలా వెలిగిపోయింది.

* * *

ఇక మాధవికి కొడుకుపై సహజంగానే అవ్యాజమైన అనురాగం కలిగింది. వాడిని ఎంత చూసినా, గుండెలకు హత్తుకున్నా తనివితీరడంలేదు. బాబుకు సేవచేసేందుకు ఎందరు దాసీలున్నా ఆ పనులన్నీ తానే చేస్తోంది. బాబు తడిపిన బట్టలు మార్చడంలో ఎంతమాత్రం చీదరనిపించడంలేదు. అంతఃపురకాంతననే సంగతి అసలు గుర్తేలేదు. ఎక్కువకాలం బాబు తనతో వుండడనే సంగతి అనుక్షణం ముల్లులా గుచ్చుకుంటోంది. ఆ బాధను భరించలేక హృదయం బీటలువారుతోంది. కొడుకును వదిలి ఎక్కడికో వెళ్ళాలని తల్చుకుంటే చాలు మనసు ఆక్రోశిస్తోంది. 'నిన్ను వదిలి వెళ్ళలేనురా కన్నా' అని గట్టిగా అదుముకుంటుంది. పసిపిల్లవాడు అని మరచి ఉక్కిరిబిక్కిరయ్యేలా ముద్దులు గుమ్మరిస్తుంది. మరుక్షణం మౌనంగా కన్నీళ్ళు కారుస్తుంది.

మాధవి అలాంటి అలజడిలో వుండగా హర్యశ్వుడు వచ్చి "ఎన్నాళ్ళయింది మాధవీ, నిన్ను దగ్గరకు తీసుకుని..." అంటూ గాఢంగా ఆలింగనం చేసుకుని శరీరాన్ని ఆక్రమించుకోబోయాడు.

ఆమెకి హృదయం రగిలిపోయి "మీ కోరిక తీరి కొడుకు పుట్టాడు కదా, ఇకపై నా జోలికి రావద్దు" అంది.

హర్యశ్వుడు కోపంగా "ఏమిటీ?" అన్నాడు.

"అవును, రాజా... మనిద్దరి సంబంధం అంతవరకే కదా. దయచేసి ఇకపై నన్ను తాకొద్దు. ఆ అధికారం మీకు లేదు" మెల్లగానే అయినా స్థిరంగా అంది మాధవి.

రాజుకు ఒళ్ళు మండిపోయింది. 'తనముందు మాట్లాడేపాటిదయిందా, ఇంత అహంకారమా?, అని ఊగిపోతూ చెంపలు ఛెళ్ళుమనిపించాడు.

మాధవి ఉక్రోషంతో బుసలుకొడుతూ శిలలా నిలబడిపోయింది.

ఇంకా వుంది.

గడువు ప్రకారం గాలవుడు వచ్చాడా?

గాలవుడి వెంట తన పసిగుడ్డుని వదిలేసి పుత్రశోకంతో ఎలా వెళ్ళగలిగింది?

పరిచారికలు, దాసదాసీజనం, మహారాణి ఆడవాళ్లే కదా...తోటి స్త్రీ అయిన మాధవికొచ్చిన పరిస్థితికి ఎలా స్పందించారు?

మిగిలిన ఆరొందల గుర్రాలకోసం గాలవుడు మాధవిని ఇంకెవరి వద్దకు తీసుకెళ్లాడు?

వచ్చే సంచికలో...

క్యాంపస్ ఛాట్

కె శివలీల

రేపు చదవొచ్చులే...!?

వాహనాల రొద తప్ప నగరమంతా నిశ్శబ్దంగా ఉంది. అంతరాత్రిలోనూ...హుషారైన మాటలతో... గట్టిగా వినిపిస్తున్న పాటలతో, నవ్వులతో... పట్టపగలును తలపిస్తోందా ప్రదేశం. అదే... క్యాంపస్ హాస్టల్...! విభిన్న మనస్తత్వాలకు, అభిరుచులకు వేదిక! అవునుమరి...ఇక్కడ కొందరు విద్యార్థులు మాటల్లోపడి నిద్రపోవాలన్న సంగతే మర్చిపోతే... మరికొందరు శ్రద్ధగా చదవాలన్న పట్టుదలతో... కేటాయించిన గదులకు దూరమై కారిడార్‌లోనో, మెట్లమీదో సెటిలైపోతారు. ఈ రెండిటికీ భిన్నంగా ఉన్నవారూ ఉంటారండోయ్... వీరి కళ్లు...పుస్తకాన్ని చదువుతూ... చెవులు... స్నేహితుల మాటలు వింటూ...ఉంటాయి. అదంతే! ఎందుకంటే ఒకపక్క స్నేహితులతో సరదాగా మాట్లాడాలనీ, మరోపక్క చదువుకోవాలనీ ఫిఫ్టీ ఫిఫ్టీగా అనిపిస్తే...ఇలానే ఉంటుంది మరి! 'వీరందరి మధ్య ఉంటూ చదువుపై దృష్టి కేంద్రీకరించడమా...! బాప్ రే!' అనుకుంటున్నారా?

ఆ రోజు నేనూ, సహజ ఇంటర్నల్ ఎగ్జామ్స్‌కు ప్రిపేరవుతున్నాం.

'ఏయ్ సౌమీ డియర్... నా ఫోటోలు చూశావా... ఎంతబాగా వచ్చాయో. నువ్వెలాగూ మా రూముకు రావుకదా. అందుకే నేనే తెచ్చా. ఇప్పుడు మీకిద్దరికీ వీటిని దగ్గరుండి నేనే చూపిస్తాను' అంటూ రూంలోకి దూసుకొచ్చింది వనజ.

"ఎంటే ఆ క్వశ్చన్ మార్క్ ఫేసు! ఓ...డిస్టర్బైన్సనా? అబ్బా... ఈ ప్రపంచంలో నువ్వొక్కదానివే చదువుతున్నట్టు... ఏంటా ఫోజు?! పదినిముషాలివి చూసినంత మాత్రాన నీ గోల్డుమెడలేం మిస్సవ్వదులే" అంటూ అతిచొరవను ప్రదర్శిస్తూ నా చేతిలోని పుస్తకాన్ని లాక్కుంది.

"ఎంటే ఆ క్వశ్చన్ మార్క్ ఫేసు! ఓ...డిస్టర్బైన్సనా? అబ్బా... ఈ ప్రపంచంలో నువ్వొక్కదానివే చదువుతున్నట్టు... ఏంటా ఫోజు?! పదినిముషాలివి చూసినంత మాత్రాన నీ గోల్డుమెడలేం మిస్సవ్వదులే" అంటూ అతిచొరవను ప్రదర్శిస్తూ నా చేతిలోని పుస్తకాన్ని లాక్కుంది.

"అదికాదే...రేపయితే తీరిగ్గా చూడొచ్చుకదా'' అంటూ ఆమెను వారించడానికి నేను చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఫలితం...

ఒంటిగంట దాటుతోంది. మా కళ్లు నిద్రతో మూసుకుపోతున్నాయి. అదిచూసిన వనజ...

"ఏంటి అప్పుడే నిద్రా...? నా దగ్గరింకో ఆల్బమ్ ఉంది. అన్నీ చిన్నప్పటి ఫోటోలే. ఎంత బాగున్నాయో... ఒక్క నిముషంలో తీసుకొస్తానుండు" అని తన గదివైపుకు పరుగు తీసింది.

"ఓ గంట తరువాత వనజ వెళ్లిపోయినా... ఆమె గురించే ఆలోచిస్తూ మేం చాలా సేపటివరకూ నిద్రపోలేదు. 'మమ్మల్ని డిస్టర్బ్ చేయొద్దు' అని ఆ రోజే ఆమెకు గట్టిగా చెప్పాలనిపించిది. కానీ 'హర్టవుతుందేమో' అని ఆగిపోయాం. ఎంతైనా మా ఫ్రెండే కదా! బాధపెట్టడమెందుకు. అందుకే... సాధ్యమైనంతవరకు ఆమెను తప్పించుకు తిరగడానికే ప్రయత్నిస్తుంటాం" అని చెబుతున్న సౌమ్య, సహజలిరువురూ ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ విద్యార్థినులు.

స్నేహం మానసిక ప్రశాంతతనిస్తుంది...కానీ ఇలాంటి వారు స్నేహితులైతే... ఎవరైనా వీరి పద్ధతినే అనుసరిస్తారేమో!?

"కొందరి ప్రవర్తన మనకిబ్బంది కలిగించొచ్చు. వారందరినీ మనకనుకూలంగా మార్చుకోవాలన్నది కల్లో మాట! దీనికోసం ప్రయత్నిస్తే మనకు మిగిలేది విభేదాలు... మనస్పర్థలు...! వీటికి స్థానం కల్పించకుండా వీరినెలా మార్చాలి? అని ఆలోచించడం మొదలెడితే...చదువు అటకెక్కడం ఖాయం! అందుకే ప్రతి విషయాన్నీ లైట్‌గా తీసుకోవాలి" అని చెబుతున్న కావ్య ఇటువంటి విషయాన్నెలా ఈజీగా తీసుకోవాలో అంత సులభంగా చెప్పలేకపోయింది.

వనజలాంటి కేసు మీకూ ఎదురైతే ఏంచేస్తారు? సాధ్యమైనంతవరకూ వారి ప్రవర్తనను మొదట్లోనే ఖండించండి. అలాకాకపోతే వారి గురించి ఆలోచించకండి. అంతేగానీ 'వారిని నొప్పించకుండా అదుపుచేయడమెలా?' అనే దిశగా మీ ఆలోచనలను మళ్లించకండి. ఎందుకంటే ఈ ఆలోచనలతోనే మీ బుర్రవేడెక్కిపోతే...మరి చదువుసంగతి? ఏదేమైనా ఇది మాత్రం ఖచ్చితంగా తీరిక చూసుకుని ఆలోచించాల్సిన విషయమే! *

సినిమా కబుర్లు

ఒక్కో నటుడు ఒక్కో మేనరిజమ్‌తో, ఒక్కో డైలాగ్‌తో చిరస్థాయిగా ప్రేక్షకుల్లో నిలిచిపోతారు. తమమీద ఒక క్రేజ్ ఏర్పరుచుకుంటారు. అలాంటి డైలాగ్ "దేశం క్లిష్టపరిస్థితిలో ఉంది". ఎస్.ఐ. పాత్ర ద్వారా ఆ డైలాగ్ చెప్పడానికి, తనకంటూ ఆ ప్రత్యేక గుర్తింపు రావడానికి నూతన్‌ప్రసాద్ ఎలాంటి శ్రమ చేశాడో చెబుతున్నారు విందాం.

చందు

"దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది"

విజయబాపినీడు నిర్మాణ సారథ్యంలో మౌళి దర్శకత్వంలో 'పట్నం వచ్చిన పతివ్రతలు' చిత్రంలో ఓ మంచి యస్.ఐ పాత్ర పోషించాల్సి ఉంది. ఈ చిత్రం ఇంకా సెట్స్ పైకి రాలేదు. నాకపుడు బుకింగ్స్ తగ్గాయని ఇండస్ట్రీలో ఒక అభిప్రాయం నెలకొంది. కానీ వాస్తవానికి నా చేతిలో ఓ 30 చిత్రాలున్నాయి. ఇండస్ట్రీ దెబ్బకి ఈ చిత్రంపై ఎక్కువ ఆశలు పెట్టుకున్నాను. బాపినీడుగారు కథ చెప్పారు. యస్.ఐ క్యారెక్టర్ ఎక్కడా రాలేదు. డౌటొచ్చి యస్.ఐ.ని పీకేశారా ఏంటి అంటే 'లేదు లేదు... ఉంది...' అన్నారు. ఆ యస్.ఐ. క్యారెక్టర్‌తో నేనేమిటో ప్రూవ్ చేసుకోవాలనుకుని దీని గురించే ఆలోచిస్తూ వారం రోజుల పాటు అర్ధరాత్రులు మద్రాస్ బీచ్‌లో తిరిగాను. ఒక ప్రత్యేకమైన శైలి, హావభావాలతో కూడిన ఆ పాత్రను పక్కాగా తయారుచేసుకున్నా. అప్పటికి చిత్రం షూటింగ్ ప్రారంభం కావడానికి ఇంకా రెండు నెలలుంది. ఇండియన్ స్క్రీన్ మీద ఇంతవరకూ ఆ పాత్ర రాలేదని అనుకున్నా. విజయబాపినీడుగారికి చేసి చూపించి ఎలా ఉందని అడిగితే బాగుంది అన్నారు. రెండు నెలలు గడిచిన తర్వాత నా పాత్ర సెట్స్‌పైకి వచ్చింది. తొలి షాట్‌లో నాతోపాటు రాధిక, గీత ఉన్నారు. ఫస్ట్ డైలాగ్ రిహార్సల్ చేశాను. డైలాగ్ ఇంగ్లీష్ రిథమ్‌లో సాగడంతో బాపినీడుగారికి నచ్చలేదు. ఈ క్యారెక్టర్ స్పెషాలిటీ అదేనండీ.. నా మీద నమ్మకముంచి పాస్‌ఆన్ చేయండి, అవసరమైతే డబ్బింగ్‌లో మారుద్దాం అన్నాను. టేక్ చేశాం. ఎలావుందని రాధికనడిగినా, లైట్ బోయ్‌నడిగినా 'ఆహా...ఓహో' అన్నారు. అయినా బాపినీడుగారికి నచ్చనూ లేదు. బాధపడనూ లేదు. ఆ మర్నాడు రావు గోపాలరావుగారితో మరో సీన్ చేస్తే ఆయన వాటేసుకుని చాలా అద్భుతంగా చేశావన్నారు. ఇదంతా చూసిన బాపినీడుగారు నవ్వుకున్నారు. సినిమా విడుదలైన దగ్గర నుంచి 'దేశం చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉంది...' అన్న డైలాగ్ ఎంత పాపులర్ అయిందో మీకందరికీ తెలిసిందే. నేనెక్కువ ఇష్టపడిన, ప్రేక్షకుల్లో స్థిరస్థాయిలో నిలిచిన వేషం అది.

పరిగెత్తుకుంటూ వెళ్ళి ఫ్లైటెక్కాను...

ఒకసారి ఎన్టీయార్‌గారి సినిమా షెడ్యూల్ బెంగుళూరులో షూటింగ్ అయిపోయింది. తెల్లారితే మద్రాస్‌లో వేరే షూటింగ్. ఆరోజు ఆఖరి ఫ్లైట్‌లో వెళ్ళకపోతే నా కారణంగా ఆ షూటింగ్ రద్దవుతుంది. ఎయిర్‌పోర్ట్ కెళితే సీటు దొరకలేదని ప్రొడక్షన్ మేనేజర్ చెప్పడంతో అతనికి లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చా. షూటింగ్‌కి వెళ్ళకపోతే చెడ్డపేరొస్తుంది. చాలా టెన్షన్‌తో ఉన్నా. మేనేజర్ మళ్లీ పరిగెత్తుకెళ్లి టిక్కెట్ దొరికిందని వచ్చాడు. అంతే...ఫ్లైట్ ఎక్కిన చివరి వ్యక్తిని నేనే. నా పక్కన కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ దంపతులు కూర్చున్నారు. నాకూ ఆయనకూ పరిచయం లేదని మిన్నకుండా ఉన్నా. జగమెరిగిన ఆయన నాలుగు నిముషాల తర్వాత 'మద్రాస్ వెళుతున్న యాక్టర్ మీరేనా' అని అడిగారు. డైరెక్ట్‌గా సినిమాల్లోకి వచ్చావా?అనడిగితే రంగస్థలం నుండి వచ్చా అన్నాను. నేను కూడా నాటక రంగం నుండే వచ్చాను. చాలా సంతోషమని, 'మద్రాస్ వచ్చినపుడు మా ఇంటికి రండి' అన్నారు. రంగస్థలం నుండి వచ్చినవారి పట్ల ఆయనకున్న ప్రేమ ఆయన మాటల్లో అర్థమైంది. 'ఒక ఆర్టిస్టు అర్జెంటుగా మద్రాసు వెళ్ళాలని చెప్పడంతో మా మనవడి సీటును మీకిచ్చి వాడ్ని ఒళ్ళో కూర్చోబెట్టుకున్నామని' చెప్పడంతో తోటి ఆర్టిస్టు పట్ల ఆయనకున్న గౌరవం అర్థమైంది. మరిచిపోలేని సంఘటనలలో ఇదొకటి.



రజనీ ది గ్రేట్

రజనీకాంత్‌కి నేనంటే ప్రత్యేకమైన ఆప్యాయత, అభిమానం. నూతన్ ప్రసాద్ మందు తాగడం మానేశాడని రజనీకాంత్‌కి ఎవరో చెప్పారట. మేమిద్దరం ఎపుడు కలిసినా, 'మనిద్దరం కలసి మందు కొట్టాలయ్యా' అంటాడు. నన్ను టెస్ట్ చేయడానికి అడుగుతున్నావా... లేదా నిజంగానే అడుగుతున్నావా! నేను మానేసి 20 సంవత్సరాలయింది. నీకోసం నేనెక్కడ తాగనయ్యా.. అనేవాడ్ని. రెండేళ్ళ క్రితం ఆయన నుండి ఫోన్ వచ్చింది.'నేను రజనీకాంత్‌ని మాట్లాడుతున్నాను. తాగుతున్నావా లేదా.. మీ ఇంటికి వస్తున్నాను' అన్నాడు. నువ్వెక్కడ ఉన్నావో చెప్పు నేనే వస్తానంటే 'నడవలేని స్థితిలో ఉన్న నిన్ను రమ్మనడం ధర్మం కాదు. నేనే వస్తాను' అంటే నిన్ను చూడడం నాకు ఆనందమే. కాకపోతే పోలీస్ బందోబస్తు నేనెక్కడ ఏర్పాటుచేయగలనయ్యా నేనే వస్తున్నానని ఆయన బసచేసిన తాజ్ కృష్ణ హోటల్‌కి వెళ్ళాను. 'త్వరలో నేనొక సినిమా తీస్తున్నాను. అందులో నీతో ఒక వేషం వేయించాలను కుంటున్నాను. వేస్తావా...' అని అడిగారు. తప్పకుండా చేస్తానన్నాను. ఇదెందుకు చెప్పానంటే సాధారణంగా మనుషులు మరచిపోతుంటారు. తమిళ సూపర్ స్టార్ నా పట్ల చూపిస్తున్న ఆప్యాయత మరువలేనిది. రజనీ ది గ్రేట్...

నాటికి ఎన్టీయార్...నేటికి చిరంజీవి

కృషి...పట్టుదల...దీక్ష...పట్టుకుంటే వదిలిపెట్టని గుణం... ప్రతిక్షణం తపన... నిరంతర సాధన... ఒక్క యన్.టి.ఆర్.లో చూసి నేర్చుకున్నా. అందమంటే ఎన్.టి.ఆర్.దే. మా యుగానికీ ఈ యుగానికీ పోలిస్తే చిరంజీవి గ్రేటెస్ట్. అతని తొలిచిత్రం, నా ఏడవ చిత్రం 'ప్రాణం ఖరీదు' చిత్రం షూటింగ్ అప్పుడు ఇద్దరం కలసి ఒకే రూములో 40 రోజులున్నాము. తెల్లార్లూ పాటలు పెట్టి డాన్స్ చేసి గోల గోల చేసేవాడు. నిద్ర పోనిచ్చేవాడు కాదు. ఈ పాటలు గీటలు ఎవరు చూస్తారయ్యా... ఈ గొడవేంటని అంటే... 'డాన్సులతో, ఫైట్లతో కూర్చోపెడతాగా' అనేవాడు. ఇన్ని సంవత్సరాలుగా అదే చేసుకుంటూ వస్తున్నాడు. చిరంజీవి ఒక ట్రెండ్ సెట్టర్.

సామాజిక ప్రయోజనం

ప్రస్తుతం ఈ టీవీలో ప్రసారమవుతున్న 'నేరాలు-ఘోరాలు' సీరియల్‌కి వాయిస్ ఓవర్ చెబుతున్నాను. 'ఇది ఒక్క నూతన్‌ప్రసాద్ వల్లే అవుతుంది. మరి వాయిస్ ఓవర్ ఇవ్వడానికి ఆయన ఒప్పుకుంటారో లేదో తెలియదు. ఆయన మన కుటుంబంలోని వ్యక్తి. స్నేహితుడు. నామాట కాదనరనే నమ్మకం ఉంది. ఒకసారి అడిగి చూడండని' రామోజీరావుగారు అన్నారట. ఈ విషయం తర్వాత తెలిసింది. ఒక రోజు ఈటీవీ నుంచి ఫోన్ వచ్చింది. వాయిస్ ఓవర్ కావాలని అడిగితే... వెంటనే ఓకె అన్నాను. ఈ 'నేరాలు-ఘోరాలు'లో సామాజిక ప్రయోజనం ఉంది. చుట్టుపక్కల ఇంత జరుగుతుంది. జాగ్రత్త పడండి అనే సందేశం ఉంది. దీన్నుంచి క్రైమ్ నేర్చుకుంటున్నారనే వాళ్ళూ ఉన్నారు. కత్తిపట్టుకుని పొడవడమే నేర్చుకుంటానంటే ఎలా ?!

(వచ్చేవారం ఏమంటారో వేచి చూద్దాం)

చిన్నారి చిత్రకారులు



ఎం.రవి బ్రహ్మచారి,
6వ తరగతి,
శ్రీ వాణి విద్యాలయం,
జనగాం, వరంగల్.

పి.కిరణ్‌కుమార్,
నవోదయ మోడల్ స్కూల్,
పాలకొండ, శ్రీకాకుళం.



నల్ల సుధాకర్, 6వ తరగతి,
శ్రీ వాణి విద్యాలయం,
జనగాం, వరంగల్.

ఒకేలా వున్నవేవబ్బా!



నేస్తాలూ! పైన ఆరు ఇళ్లు వున్నాయి. చూశారుగా. వాటిని బూటులో కట్టారు. తమాషాగా వున్నాయికదూ చూస్తుంటే. అసలు విషయం ఏంటంటే... వీటిలో రెండు మాత్రం అచ్చుగుద్దినట్టు ఒకేలా వున్నాయి. అవేంటో కనిపెట్టండి చూద్దాం.

చుక్కలు కలిపేద్దాం



bed	day	night
body	fix injuries	skin
bones	grow	sleep
brain	healthy	think
concentrate	muscle	wakeup

అవేంటో కనిపెట్టాలోచ్

జవాబు

కత్తిరించి అతికించండి

ఇక్కడ ఓ బుల్లి కుందేలు వుంది కదా. పాపం దానికి వాళ్ల మమ్మీ కనిపించలేదు. అన్నట్టు కింద ముక్కలు వున్నాయి కదా. ముందు మీరు వాటిని కత్తిరించండి. తార్వత అచ్చు బుల్లి కుందేలులాగా అతికించండి. తల్లికుందేలు మీ ముందుంటుంది. చిన్నారి కుందేలూ ఆనందిస్తుంది.



మేం చెప్పిన రంగులేయండే

ఈ చక్కటి బొమ్మకు కింద మేం చెప్పిన రంగులేయండి. అదురుద్ది.



1. red
2. pink
3. purple
4.yellow
5.green

11.9.05 కు సరైన సమాధానం రాసినవారు

గుండు లక్ష్మీ శేష పావని, 5వ తరగతి, చిలకలూరిపేట. లాకావత్ సురేందర్ నాయక్, 10వ తరగతి, తాళ్లపల్లి సురేందర్ గౌడ్ (బన్ని), 10వ తరగతి, కొండబోయిన రాజు (సత్తి), 10వ తరగతి, డి. భాస్కర్ నాయక్, 9వ తరగతి, ఎం.శిల్ప, 10వ తరగతి, జి.సురేందర్ నాయక్, 10వ తరగతి, శ్రీవాణి విద్యాలయం, జనగామ. దుస్సా అక్షయ్ కుమార్, 5వ తరగతి, జనగామ. వి.నరసింహ, వి.రాము, బి.విష్ణు, 7వ తరగతి, వి.ఆంజనేయులు, వి.నరసింహ, 8వ తరగతి, నేషనల్ హైస్కూల్, నాగర్‌కర్నూల్. జి.బస్వరాజ్, 10వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర), ధన్‌వాడ. యు.శ్రీధర్, గాంధీనగర్, సికింద్రాబాద్. ఎస్.అంజప్ప, 10వ తరగతి, జడ్‌పిహెచ్‌ఎస్, ధన్వాడ. కె.అశోక్‌తేజ, 10వ తరగతి,శాంతి టాలెంట్ హైస్కూల్, పత్తికొండ, కర్నూలు. కె.రాజీవ్‌గాంధీ, 10వ తరగతి, రొంపిమళ్ల. డి.ప్రియాంక, 7వ తరగతి, శ్రీనికేతన్, వైరా. వి.సుమంత్, 6వ తరగతి, నెహ్రూ హైస్కూల్, అద్దంకి. రాళ్లబండి సాయికిరణ్, 4వ తరగతి, శ్రీరాంపూర్ కాలనీ. ఎ.సాహిత్య లోహిత, 4వ తరగతి, ఎ.శరత్‌చంద్ర, 2వ తరగతి, పాలకొల్లు. సిహెచ్. అర్జున్‌రావు, 9వ తరగతి, బిసి హాస్టల్, పల్లెర్లమూడి. ఎస్.మౌనీష్, 5వ తరగతి, చైతన్య హైస్కూల్, ఎస్.మాధురి, 2వ తరగతి, లిటిల్ సోల్జర్స్ స్కూల్, తిరుపతి. ఎ.ప్రసాద్, 9వ తరగతి, నవోదయ మోడల్ స్కూల్, పాలకొండ. కె.భీమయ్య, 10వ తరగతి, జడ్‌పిహెచ్ ఎస్ (బోయిస్), ధన్వాడ. జి.సాయిభరత్‌రెడ్డి, 7వ తరగతి, మోదుకూరు, గుంటూరు. ఎస్.కేశవమూర్తి, 2వ తరగతి, శ్రీ రాఘవేంద్ర ఇంగ్లీషు మీడియం స్కూల్, ఆదోని. బి.రత్నసుధీర్, 8వ తరగతి, జడ్‌పిహెచ్‌స్కూల్, మోదుకూరు. పి.సుశేనకుమారి, 8వ తరగతి, గురుకుల పాఠశాల, ఖమ్మం. వి.అరుణ, చిన్నమండ్యెం, కడప. అంజనమ్మ, 10వ తరగతి, గరల్స్ హైస్కూల్, చిన్నమండ్యెం, కడప. డి.నాని, 4వ తరగతి, మదర్ థెరిస్సా హైస్కూల్, రంగారెడ్డి. వి.వి.కిరణ్‌కుమార్, 9వ తరగతి, సున్నిపెంట, శ్రీశైలం. కె.మహేష్, మరిపెడ, వరంగల్. ఎస్.ఎ.ఆర్. సురేష్, 9వ తరగతి, ఎపిఎస్‌డబ్ల్యుఆర్ స్కూల్, సూదివలస. బి.లావణ్య, 10వ తరగతి, జి.యు.పి.ఎస్.స్కూల్, కొత్తపేట, బయ్యారం. కె.శ్రీఅనూహ్య, 7వ తరగతి, గుంటూరు. కె.ఆనంద్‌కుమార్, 7వ తరగతి, జడ్‌పిఎస్ఎస్, చేర్యాల, వరంగల్. కె.సంతోష్, 9వ తరగతి, శివశంకర్, 7వ తరగతి, మమత హాస్టల్, నల్లగొండ.

18.9.05 సమాధానం:
గురజాడ అప్పారావు

వీరి వీరి గుమ్మడి పండు
వీరి పేరేమి?

హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినదెవరో తెలుసా! ఆ... ఈ చిహ్నం న్యాయస్థానంలో వుంటుంది. మరి అదేంటో వెంటనే కార్డు మీద రాసేసి పోస్ట్ చెయ్యండే. మా చిరునామా: వీరి వీరి గుమ్మడి పండు, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

అట్టమీది కథ

పొత్తూరి రాజేంద్రప్రసాద్‌వర్మ

అంతుపట్టని పిరమిడ్‌లు, మమ్మీలు

"మమ్మీ..మమ్మీ... "మమ్మీ" అంటే గుడ్డలతో చుట్టిన శవమట! మావయ్య చెప్పాడు. నిన్ను ఇక నుంచి అమ్మా అని పిలుస్తానే" అని పద్మ, రాణి, లక్ష్మి తమ చిన్నప్పుడు అంటే పదేళ్ల క్రితం అన్నారు. ఇప్పటి పిల్లలు టింకూ, రేష్మా, రోనీలకయితే మమ్మీలు, పిరమిడ్‌లు గురించి వాళ్లకు తెలిసినంత బాగా పెద్దాళ్లకు కూడా తెలియదు. దానిక్కారణం ఇటీవల "ది మమ్మీ", "మమ్మీ రిటర్న్స్' అనే సినిమాలు హెచ్‌బిఓ ఛానల్‌లోనో, జెమినీలో దాని తెలుగు డబ్బింగ్‌నో చూసుంటారు. ఆ సినిమాల తరువాత ఇళ్లలో ఉన్న చిన్నా పెద్దా అందరికీ ఈజిప్ట్ పిరమిడ్‌ల గురించి, వాటిలోని మమ్మీల గురించి ఎనలేని ఆసక్తి కలిగింది. ఈ సినిమాల్లో ఉన్న కాస్తంత చరిత్రను సినిమాటైజ్ చేసి చిత్రవిచిత్రాతి చిత్రంగా చూపించారు. ఆ పిరమిడ్‌లు, మమ్మీలు ఈనాటికీ అంతుచిక్కనివిగా, విస్మయం కలిగించేవిగానే ఉండిపోయాయి. ప్రపంచవింతల్లో వింతగా గిజా గ్రేట్ పిరమిడ్ కనువిందు చేస్తూనేఉంది.

ఈజిప్టు దేశానికి చెందిన వింతలు వాటి వెనుక అంతర్గత రహస్యాల పట్ల ప్రపంచంలో చాలామందికి విపరీతమైన ఆసక్తి ఉంది. ఆ దేశస్తులు నిర్మించిన పిరమిడ్‌లు వందల సంవత్సరాలు గడిచిపోయినా చెక్కుచెదరకపోవడం, దుర్భేధ్యంగా ఉండటం ప్రధాన ఆకర్షణగా ఉంది. ఆ దేశానికి చెందిన రాజవంశీయులు మృతి చెందితే వారి శరీరాలను మమ్మీలుగా మార్చడం, వారు మళ్లీ బతికి వస్తారన్న నమ్మకం ఆ దేశస్తుల్లో ఉండటం ఎంతో ఆసక్తిని కలిగిస్తుంది. ఆధునిక, పరిస్థితుల్లో సైన్సు ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ వాటి నిర్మాణ రహస్యాలు ఎవరికీ అంతుపట్టడం లేదు. వేల సంవత్సరాల నాటి వారి ఆలోచనా విధానాలు అబ్బురపరుస్తుంటాయి. ప్రపంచంలో ఏడవ వింతగా ఉన్న గ్రేట్ పిరమిడ్ మిస్టరీని ఛేదించడానికి ప్రయత్నాలు సాగినప్పటికీ పూర్తి స్థాయిలో ఫలితాలను ఇవ్వలేదు. అయినప్పటికీ పురాతత్వ శాస్త్రవేత్తలు తమ పరిశోధనలను కొనసాగిస్తూనే ఉన్నారు. ఈజిప్టులో పిరమిడ్ల నిర్మాణం ఇప్పటికీ ప్రపంచ ప్రజలకు మిస్టరీగానే మిగిలిపోయింది. దీనిని ఛేదించడానికి జరిగిన ప్రయత్నాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

ప్రపంచవింతల్లోని "గ్రేట్ పిరమిడ్"

ప్రపంచ ఏడు వింతలలో ఒకటైన గ్రేట్ పిరమిడ్ ఈజిప్టులో గిజా ప్రాంతంలో ఉంది. దీనిని ఈజిప్టులో 4వ సామ్రాజ్యపతి ఫారో ఖుఫూ నిర్మించారు. అయిదు లక్షల డెబ్బయివేల చదరపు అడుగుల విస్తీర్ణంలో దీనిని నిర్మించారు. 756 అడుగుల ఎత్తు కలిగిన దీని నిర్మాణానికి ఒకొక్కటి రెండున్నర టన్నుల బరువు కలిగిన 23 లక్షల రాతిపలకలను ఉపయోగించారు. క్రీస్తు పూర్వం 2560ల్లో నిర్మించిన ఈ పిరమిడ్ ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ఇందులో ఎన్నో గదులు, వరండాలు, గేలరీలు, సొరంగమార్గాలు ఉన్నట్లు చరిత్రకారులు చెబుతారు. నేషనల్ జాగ్రఫిక్ బృందం 2002 ప్రారంభంలో ఈ గ్రేట్ పిరమిడ్ రహస్యాలను కనుగొనాలని





సంకల్పించింది. పిరమిడ్ రోవర్ అనే రోబో సాయంతో పిరమిడ్‌లోకి ప్రవేశించారు. సాహసంతో ఒక యాత్ర మాదిరి ఈ పిరమిడ్‌లోకి చొచ్చుకుపోయారు.

పిరమిడ్ చాంబర్ నుంచి కారిడార్‌లో ప్రవేశించి సన్నగా ఎత్తు తక్కువగా ఉన్న మార్గంలో ప్రయాణిస్తే పిరమిడ్ గర్భంలోకి చేరుతామని గుర్తించారు. అక్కడ మహారాణి కోసం నిర్మించిన గది, దానికి అడ్డంగా రాతిగోడలను నిర్మించారు. 30 సెంటీమీటర్ల పొడవు 12 సెంటీమీటర్ల వెడల్పు గల గోడకు రంధ్రంచేసి లోపలికి ప్రవేశిస్తే అందులో మరో గోడ అడ్డంగా కనిపించిందని, ఆ లోపల ఏముందో తెలుసుకోలేకపోయామని ఈ బృందం వెల్లడించింది. అక్కడ గోడలపైన కుర్చీపై కూర్చున్న పురుషుడు అతని పక్కన నిలుచున్న మహిళ చిత్రం ఉంది. ఆ కింద ఈజిప్షియన్ చిత్రలిపిలో కొన్ని వాక్యాలు ఉన్నాయి. ఆ సమీపంలో రాతితో నిర్మితమైన సమాధి, దానిపైన రాయిని పెట్టి సున్నంతో పూడ్చివేసి ఉంది. ఈ పరిశోధక బృందం ఈ రాయిని పెకలించి చూస్తే అందులో ఒక అస్థిపంజరం కనిపించింది.

ఫలించని ప్రయత్నం

పిరమిడ్‌లోకి ప్రవేశించిన బృందానికి డాక్టర్ హవాస్ నాయకత్వం వహించారు. మొత్తం ఈ పరిశోధన కోసం సుమారు అయిదు కోట్ల రూపాయల వ్యయం అయింది. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు కనిపించలేదు. పిరమిడ్‌లలో సమాధి చేయబడిన వ్యక్తుల ధనరాశులు ఉంటాయని ఒక అపోహ ఉండేది. అయితే పరిశోధక బృందానికి అటువంటివి కనిపించలేదు. పిరమిడ్ మధ్య భాగంలో దుర్భేద్యమైన గోడలను ఛేదించలేక వెనుతిరగవలసి వచ్చింది. ఆ లోపలికి ప్రవేశించినట్లయితే మరిన్ని విషయాలు తెలిసి ఉండేవి. కాని ఈ బృందం అంతకన్నా ముందుకు వెళ్లలేకపోయింది. చాలా పిరమిడ్‌లలో మమ్మీలుగా మార్చబడిన వ్యక్తులు ఉంటారని అప్పటివరకూ ఒక వాదన ఉండేది. కాని పరిశోధకులకు అస్థిపంజరాలు మాత్రం లోపల కనిపించాయి. అందులో గోడలపై కనిపించిన ఈజిప్టు దృశ్య లిపిని ఇంకా పరిశోధించవలసిన అవసరం ఉంది. అధునాతన సాంకేతిక పరికరాలను ఉపయోగించినా ఈ పిరమిడ్‌లను పూర్తిగా పరిశీలించడం నేటి పరిశోధకులకు సాధ్యం కావడం లేదు. ఎటువంటి సాంకేతిక అభివృద్ధి లేని వేల సంవత్సరాల క్రితం ఇంత భారీ నిర్మాణాలు ఎలా చేశారన్న విషయం ఎవరికీ అర్థం కావడంలేదు. ప్రస్తుతం క్రెయిన్‌లతో మాత్రమే తరలించగలిగే రెండున్నర టన్నుల బరువుగల అంత రాళ్ళను ఎత్తయిన పిరమిడ్ల నిర్మాణాలకు ఎలా ఉపయోగించారో సస్పెన్సుగానే ఉంది. ఈజిప్టు పిరమిడ్‌ల గూర్చి పరిశోధనలు చేస్తున్న మార్క్ లెహ్నర్ అనే శాస్త్రవేత్త ఈ పిరమిడ్లను ముప్పయివేల మంది కార్మికులు నిర్మించి ఉంటారని, ఒకొక్కదానికి పది పన్నెండు సంవత్సరాల సమయం పట్టి ఉండవచ్చునని అభిప్రాయపడుతున్నారు. ఈ సమీపంలో కార్మికుల కోసం గ్రామాలు కూడా వచ్చాయని అయన పరిశోధనలో పిరమిడ్ల విషయంలో గ్రీకు యాత్రికుడు హెరిడోటస్ తన పరిశీలనలో లక్షమంది బానిసలు ఈ పిరమిడ్లు నిర్మించారని పేర్కొన్నారు. అప్పట్లో కూలీలు రొట్టెలు, చేపలు తినేవారని, మట్టితో చేసిన పలకలపై పడుకొనేవారని చెప్పారు. అయితే ఈ పిరమిడ్ల విషయంలో పూర్తిస్థాయిలో పరిశోధనలు మాత్రం ఊపు అందుకోలేదు. కానీ ఈ పిరమిడ్ల నిర్మాణానికై లక్షలాదిమంది బానిసలను వినియోగించారని, వారెన్నో చిత్రహింసలకు, దోపిడీ దౌర్జన్యాలకు గురయ్యారనే చారిత్రక సత్యం మాత్రం నిర్వివాదాంశం.

సినిమాల్లో పిరమిడ్‌లు, మమ్మీలు

ఇప్పుడందరికీ బాగా పరిచయమైన "మమ్మీ" సినిమాల సిరీస్ కంటే చాలాకాలం క్రితం "టెన్ కమాండ్‌మెంట్స్" సినిమాలో పిరమిడ్ నిర్మాణం సన్నివేశంతో దాదాపు పావువంతు సినిమాకథ నడుస్తుంది. అందులో ఒక ముఖ్యపాత్ర యువరాజుగా ఉండగా వేలాదిమంది బానిసలతో పిరమిడ్ నిర్మించడం మొదలౌతుంది. రాజు ముసలివాడైనాక అతని సమాధిగా ఆ పిరమిడ్ సిద్ధమవుతుందన్నమాట. "ది బైబిల్" నుంచి నేటి మమ్మీ, మమ్మీ రిటర్న్స్ వరకూ అనేక సినిమాల్లో ఈ పిరమిడ్‌లు, మమ్మీలు కనబడతాయి.

మమ్మీల మర్మం ఏవిటో మరి!

పర్షియన్ పదమైన 'ముమయె' నుంచి ఈ మమ్మీ పదం పుట్టింది. క్రీస్తు పూర్వం 2600లో ఈజిప్టును పరిపాలించిన రాజవంశీయుల నుంచి మమ్మీల రూపకల్పన జరుగుతున్నట్లు చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. క్రీస్తుపూర్వం 1570-1075 మధ్య ఈజిప్టును పరిపాలించిన 'టుటాంఖమన్' అనే రాజు హయాంలో మమ్మీల తయారీలో అద్భుత నైపుణ్యాన్ని చూపించారు. ముందుగా మృత శరీరాన్ని గడ్డకట్టించి అందులో నీటిని ఇంకిపోయేలా చేసేవారు. బాక్టీరియా, మానవఎంజైమ్‌ల కారణంగా కుళ్లిపోకుండా కొన్ని రసాయనాలను ఉపయోగించేవారు. ఈ మమ్మీలను అప్పటి మతగురువులు చేసేవారు. అనంత వాయువుల్లో కలిసిపోయిన జీవాత్మ తిరిగి వస్తుందని, శరీరం లేకపోతే బాధపడి పూర్తిగా అంతం అయిపోతుందని ఓ నమ్మకం. అందుకే శరీరాన్ని భద్రంగా ఉంచాలని ఈజిప్టు దేశస్తులు నమ్మేవారు. వారి విశ్వాసం కారణంగానే మమ్మీల తయారీకి కార్యక్రమం మొదలైంది. మరణానంతరం ఆ వ్యక్తి సుఖంగా ఉండేందుకు వీలుగా విశాలంగా సమాధులను నిర్మించేవారు. అందులో అతనికి సంబంధించిన వస్తువులను బాక్సులలో కూడా ఉంచేవారు. మమ్మీని భద్రపరిచి సమాధి చేసేముందు పెద్ద వేడుకను నిర్వహించేవారు. ఆ సమయంలో మత గురువు మృత శరీరంలో ప్రతి అవయవాన్ని స్పృశించేవాడు. నోటిని తాకడం వల్ల మృతజీవి తినడం, తాగడం వంటివి పనులు చేయగలవని నమ్మేవారు. మమ్మీ అనేది ఆత్మకు

నివాసస్థలంగా వారు భావించేవారు. మరణానంతరం మరో జీవితం ఉంటుందని వారు ఎంతగానో నమ్మేవారు. ఆ నమ్మకం ఆధారంగానే తమకు కావలసిన వ్యక్తులను, ముఖ్యులను మమ్మీలుగా మార్చేవారు. కొన్ని వందల సంవత్సరాలు అయినప్పటికీ చెక్కుచెదరని రీతిలో మమ్మీలు ఉండటం ఎంతోమంది పరిశోధకులని ఆశ్చర్యంలో ముంచెత్తుతోంది. ఎటువంటి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం లేని సమయంలో మృతజీవి శరీరం నిల్వ ఉండటానికి ఏమేమి చేసేవారన్న విషయం ఇప్పటికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఈ మమ్మీలను పరిశీలించి నట్లయితే అప్పటి వారి ఆలోచనాశక్తి, అవగాహనా శక్తితో పాటు నిర్మాణంలో రహస్యం కూడా అంతు చిక్కడంలేదు.

మమ్మీలంటే మాటలుకాదు

శరీరంలో తేమని పీల్చ డానికి సోడియం కార్బోనేట్, బై- కార్బోనేట్‌లను కలిపితే లవణంగా తయారవుతుంది. మృత శరీరం పాడవకుండా దీనిని ఉపయోగించేవారు. మృతిచెందిన వ్యక్తిని మమ్మీగా మార్చాలనుకున్నప్పుడు కొన్ని రసాయనాలతో నింపిన సంచులను శరీరంలోపల ఉంచేవారు. దాంతో శరీరంలో ఉన్న నీరంతా ఇంకిపోతుంది. శరీరం పూర్తిగా ఎండిపోయిన తర్వాత ఆ సంచులను తీసివేస్తారు. మృత శరీరంలో గుంటలు పడినచోట నారవస్త్రాలను, ఇతర పదార్థాలను అందులో ఉంచేవారు. కళ్లగుంటల వద్ద కృత్రిమకళ్లను అమర్చేవారు. నారవస్త్రాలలో శరీరాలను చుట్టి అవి కుళ్లిపోకుండా పొడి ఇసుక తగిలే ప్రదేశంలో ఉంచేవారు. శరీరంలో త్వరగా కుళ్లిపోయే అంతర్గత అవయవాలన్నింటినీ తొలగించేవారు. ప్రత్యేకమైన సాధనాలతో ముక్కు రంధ్రాల ద్వారా మెదడును పొట్టలోపల అవయవాలను ఆపరేషన్ చేసిన మాదిరిగా తొలగిస్తారు. గుండెను మాత్రం యథావిధిగా ఉంచేవారు. వ్యాధుల వల్ల ఎవరి శరీరాలైనా కుంచించుకుపోయినట్లయితే గుడ్డలు, ఊక నింపేవారు. మొదట్లో తేనె, మైనం, సుగంధ ద్రవ్యాలను ఉపయోగించేవారు. ఆ తర్వాత కాలంలో శరీరాన్ని ప్లాస్టర్‌తో పూతపూసి ముఖ కవళికలు స్పష్టంగా కనిపించేలా లేత ఆకుపచ్చరంగు పూసేవారు. ఈ విధంగా మృత శరీరాన్ని మమ్మీగా తయారుచేయడానికి 70 రోజుల సమయం పట్టేది. ఆ తర్వాత కాలంలో శరీరానికి తైలాలను, చెట్ల నుంచి తీసిన జిగురును పూసి పల్చటి నారవస్త్రాలతో చుట్టేవారు. ఆ వ్యక్తి మొహానికి ఆ వ్యక్తి ముఖం మాదిరిగా తయారు చేసిన మాస్కును తొడిగేవారు. ఈ విధంగా చుడుతున్నప్పుడు ఏ అవయవమూ కదలకుండా మతగురువులు జాగ్రత్త వహించేవారు. ఇలా చుట్టిన వస్త్రాలపై ప్లాస్టర్ పూతపూసి మత సంబంధమైన సూక్తులను రాజరిక వంశవృక్షాలను రచించేవారు.



మమ్మీలపై పరిశోధనలు

హీరోడాటస్ అనే ఈజిప్టు చరిత్రకారుడు కొన్ని పరిశోధనల ద్వారా మమ్మీల గూర్చి చాలా విషయాలు ప్రపంచానికి తెలియజేశాడు. గతంలో ఉన్న మమ్మీలను డి.ఎన్.ఎ. ఎం.ఆర్.ఐ. ఎక్స్‌రే, సి.టీ. స్కాన్ వంటి పరీక్షల ద్వారా వివరాలు సేకరించారు. లభించిన మమ్మీలలో అత్య ధికం జబ్బులతో మృతి చెందినవారని తేలింది. ఆరోగ్యానికి వివిధ రకాల చికిత్సలు చేయించుకున్న వారు ఉన్నట్లు తెలిసింది. రెండువేల సంవత్సరాల నుంచి మానవశరీరం చెక్కు చెదరకుండా ఉండేందుకు ఏంచేశారన్న విషయం ఇప్పటికే మిస్టరీగానే ఉండిపోయింది. లాంగ్ ఐలాండ్ యూనివర్సిటీకి చెందిన బాబ్ బ్రియర్ అనే పరిశోధక బృందం ప్రాచీన చరిత్రకారులు రచించిన పుస్తకాల ఆధారంగా మమ్మీ రూపకల్పన వెనుక అంతర్గత విషయాలను కనుగొన్నారు. మమ్మీల తయారీలో డీహైడ్రేషన్ విధానం ప్రధానమైనదని గుర్తించారు. ఫార్మాల్డిహైడ్, ఎపిటోన్ లాంటి ద్రావణాలను ఉపయోగించడం ద్వారా మమ్మీలను పాడైపోకుండా ఉండిపోవచ్చని కనుగొన్నారు.

పిరమిడ్‌లు, మమ్మీల వంటివి ఈజిప్టులోనే తయారవడం వల్ల ప్రపంచంలో పురాతత్వ శాస్త్రజ్ఞుల దృష్టి దీనివైపే కేంద్రీకృతం అయివుంది. పరిశోధకులకు సవాల్‌గా ఉన్న ఈ విషయాల వెనుక రహస్యాలను కనుగొన్నట్లయితే వేల సంవత్సరాల క్రితం వారి తార్కికజ్ఞానం, పరిశీలనా శక్తి నేటి తరానికి ఉపయోగకరమైనరీతిలో మలుచుకోవచ్చు. ఎటువంటి శాస్త్రపరిజ్ఞానం లేని సమయంలో అంతటి మేధాశక్తి ఎలా సమకూరిందన్న విషయం తెలుసుకుంటే ఈజిప్టు ప్రజల అవగాహనా శక్తిని ప్రపంచ ప్రజలందరూ తెలుసుకోవచ్చు. *



ఆరోగ్యం

ఆరోగ్యానికి ఆకు కూరలు

డాక్టర్ సేవకుమార్



ఆకు కూరల్లో మన ఆరోగ్యానికి ఎంతో అవసరమైన ఎన్నో పోషక విలువలున్నాయి. వీటిలో పీచు పదార్థం, విటమిన్‌లు, ఖనిజలవణాలు ఎక్కువగా ఉంటాయి.

ఆకుకూరల్లో అనేక రకాలున్నాయి. ఒకే ఆకుకూరను ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో కూడా పిలవడం జరుగుతుంది. వీటిలో తోటకూర, గోంగూర, బచ్చలికూర, పాలకూర, చుక్కకూర, కరివేపాకు, కొత్తిమీర, పుదీనా మొదలైనవి పేర్కొనదగినవి. ఇవి చాలా చౌకగా ఎక్కడబడితే అక్కడ దొరుకుతాయి.

ఆకు కూరల్లో కాల్షియం, ఫాస్ఫరస్, మెగ్నీషియం, ఐరన్, పొటాషియం వంటి ఖనిజలవణాలు ఎక్కువగా ఉంటాయి. ఎ, బి, సి విటమిన్‌లు పుష్కలంగా ఉంటాయి. ఆకు కూరలు జీర్ణశక్తిని పెంపొందిస్తాయి. రక్త ప్రసరణను మెరుగు పరుస్తాయి. ఆకు కూరల్లో ఉండే ట్యూలెన్ అనే పదార్థం క్యాన్సర్‌ను నిరోధిస్తుందని వైద్య పరిశోధనలు నిరూపించాయి.

ఆకు పచ్చని ఆకు కూరల్లో ఫోలిక్ యాసిడ్ అధికంగా ఉంటుంది. ఇది రక్తహీనతను నిరోధించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. గర్భం ధరించిన స్త్రీలు ఎక్కువగా ఆకు కూరలు తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన, మంచి శరీర ఛాయ కలిగిన శిశువులకు జన్మనిచ్చినట్లు పరిశోధనల్లో వెల్లడయింది. ఆకు కూరలు శరీరంలో కొలెస్టరాల్ స్థాయిని నియంత్రిస్తాయి. ఎథిరోస్క్లిరోసిస్ వంటి రక్త నాళ సంబంధ వ్యాధుల నుంచి రక్షిస్తాయి. ఎముకలకు బలాన్ని చేకూర్చుతాయి. ఆకు కూర ఏదైనా కొంచెం అటూఇటుగా వంద గ్రాముల ఆకు కూర 40 - 50 కేలరీల శక్తినిస్తుంది. వంద గ్రాముల ఆకు కూరలో 6 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 4.9 గ్రాముల పొటీన్లు, 0.4 గ్రాముల కొవ్వు పదార్థాలుంటాయి. అలాగే 350 - 400 గ్రాముల కాల్షియం, 300 - 350 గ్రాముల సోడియం, పొటాషియం, ఐరన్‌లు ఉంటాయి. ఇలా ఎన్నో రకాల పోషక విలువలు గల ఆకు కూరలను ఎలా వండాలో తెలియక ఇష్టమొచ్చిన రీతిలో వండటం వల్ల పోషకాలను వదులుకోవలసి వస్తోంది. చాలా మంది నిస్సారమైన ఆకు కూరల వంటకాలను తింటున్నారని పరిశోధనల్లో వెల్లడయింది. ఆకు కూరలను పరిశుభ్రమైన నీటిలో కడగాలి. తర్వాత అవసరాన్ని బట్టి చిన్నచిన్న ముక్కలుగా కోసుకోవాలి. ముక్కలుగా కోసిన తరువాత కడగ కూడదు. కాడలు కూడా పోషక పదార్థాలను కలిగి ఉంటాయి. వాటిని తీసి పారేయకూడదు. తక్కువ నీటిలో ఉడకబెట్టాలి. ఉడక బెట్టిన తర్వాత ఉన్న నీటిని పారబోయ కూడదు. ఈ నీటిలో బోలెడు పోషక పదార్థాలున్నాయని వైద్యశాస్త్రం నిరూపించింది. ఏది ఏమైనా ఏ ఆకు కూర అయినా ఎంతో ఆరోగ్యదాయకం అన్నది సుస్పష్టం. వాటిలో లభించే పోషక విలువలు మరే పదార్థాలూ అందివ్వలేవు. శరీరాన్ని అన్ని విధాలా శక్తివంతంగా తయారు చేయగలిగే శక్తి ఆకు కూరలకు ఉంది. ఎదిగే పిల్లలకు ఆకు కూరలకు మించిన ఔషధం లేదు. రోజూ భోజనంలో ఆకు కూరల్ని పెంచుకొని ఆరోగ్యాన్ని, జీవిత కాలాన్ని పెంచుకోవచ్చును. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. నవ్య నాగరికత ముసుగులో... మోజులో.. బలవర్ధక ఆహారం అనే భ్రమలో ఫాస్ట్‌ఫుడ్స్... మాంసాహారం తింటే అనారోగ్యం తప్పదు. ఇందుకు ఒక ఉదాహరణను ప్రస్తావించడం అనుచితం కాబోదు అనుకుంటాను. ఆకులు తిన్న మేకలు అలుపూ సొలుపూ లేకుండా కొండలెక్కుతున్నాయి. మేకల్ని తిన్న మనిషి అనారోగ్యంపాలై మంచమెక్కుతున్నాడు. ఏది ఏమైనా ప్రకృతి మనకిచ్చిన వరం ఆకు కూరలు. పేద వారికి, ధనవంతులకు అన్ని రకాల ఆహారపు విలువల్ని కలిగి అతి విరివిగా, చౌకగా లభించేవి ఆకు కూరలు. అందుకే ఆరోగ్యం కోసం తప్పక ఆకు కూరలు తీసుకోండి.

కథ

యర్నాగుల సుధాకరరావు

తన భర్త కల నిజమైంది. కానీ తన కల... నిజం కాకూడదు. అలాంటి కొడుకు పంచన తాను బతక్కూడదు. ఈ దేవాలయమే తనకు పెద్దదిక్కు

"ఈ కల నిజం కాకూడదు"

"అమ్మా! నా తప్పులను క్షమించి నువ్వూ నాన్న గారు ఈ ఓల్డేజీ హోం నుంచి మనింటికొచ్చేయండి. లంకంత కొంప... మేమిద్దరం ఉద్యోగాలు వెలగబెట్టి ఏరాత్రికో ఇంటికి చేరుతున్నాం... పిల్లలు రెసిడెన్షియల్ స్కూళ్లలో చదువుతున్నారు. మీ ఇద్దరినీ వేం కంటికి రెప్పలా చూసుకుంటాం...పదమ్మా మనింటికెళదాం..." అంటూ ప్రాధేయపడ్డాడు శ్రీరాజ్.

పొంగిపోయింది తల్లి విద్యావతి. కొడుకును నమ్మలేనట్లు చూసింది.

"మీరూ వద్దు.మీ ఆస్తులూ వద్దు. అసలు నాన్నగారి పెన్షనూ వద్దు. మీ ముఖాలు కనబడకుండా ఉంటే చాలు" అని కొంప అదిరేలా అరుస్తూ చెప్పిన పుత్రరత్నంలో ఇంత మార్పా? కనీసం ఈ ఓల్డేజీ హోంలో చేరిన తరువాత ఒక్కసారైనా చూడడానికి రాలేదు. ఆ ఆస్థి ఎక్కడుంది? ఈ డాక్యుమెంట్ అప్పుకు ఎవరు రాశారు? లాంటివి కనుక్కోవడానికి అప్పుడప్పుడు కోడలుపిల్ల మాత్రం వస్తుంది. అలాంటిది ఏకంగా పుత్రుడే వచ్చి ఇక్కడుండొద్దు అంటున్నాడంటే....ఇది కలా? నిజమా?" అని ఆశ్చర్యపోయింది.



ఈ విషయాన్ని భర్తకు చెప్పడానికి "ఏమండీ! మిమ్మల్నే..." అంటూ పెద్దగా అరిచింది.

భర్త రాజారావు ఉనికే లేదు. గదులన్నీ తిరిగింది. అతని జాడే లేదు. దాంతో "ఏమండీ..." అంటూ ఎలుగెత్తి పిలిచింది.

ఆమెను ఒక్క కుదుపు కుదిపి లేపాడు రాజారావు. విద్యావతి ఉలిక్కిపడి నిద్రలేచింది.

"ఏయ్ ఏమిటోయ్... ఓల్డేజి హోం అదిరేలా నన్ను పిలుస్తున్నావు. కలకన్నావా? నీ అరుపులకు చాలామందికి నిద్రాభంగమయింది... ఇదిగో మంచి నీళ్లు తాగు స్థిమితపడతావు" అని గ్లాసందించాడు.

నీళ్లుతాగాక...భర్తవైపు చూసి "అవును. కలగన్నాను. బంగారం లాంటి కల..! నిజమైతే ఎంత బావుణ్ను" అని సన్నగా రోదించింది.

"కొడుకూ కోడలు కల్లోకొచ్చారా?"

"అవునండి. మీరిక్కడ ఉండొద్దు. నా దగ్గరికొచ్చేయండని వాడు నన్ను ప్రాధేయపడుతున్నట్టు కలగన్నాను" అని చెప్పి కుళ్లికుళ్లి ఏడ్చింది.

"ఇష్...ఎవరైనా వింటారు. వారికి నిద్రాభంగం కలుగుతుంది... జరగరానివి కలలుగానే కన్పిస్తాయి. నువ్వు చెప్తున్నావు నేను చెప్పడం లేదు. అంతే తేడా. నాకెప్పుడూ ఒకే తరహా కలొస్తుంది... అదేమిటో తెలుసా... నేను ఈ హోం లోనే చచ్చిపోయాననీ, ఇక్కడివారే అంత్యక్రియలు చేశారనీ, మనబ్బాయి కనీసం చూడ్డానికైనా రాలేదనీ"

భర్తవేపు వేదనగా చూసింది "మీరిప్పుడే అన్నారు జరగరానివి కలలుగానే వస్తాయని మీ కలా జరగదు...."

"మనిద్దరి కలలు జరగవు. సరేనా. నిద్రపో" అని చెప్పి తాను అటువేపు తిరిగి పడుకున్నాడు. అతని వైపే చూస్తూ నిద్రపోయింది.

ఉదయాన్నే లేచింది. భర్త ఇంకా అటువైపు తిరిగి పడుకునే ఉన్నాడు. మెల్లగా తట్టింది. కర్రలా... గట్టిగా తగిలాడు. ఉలిక్కిపడి తడిమింది. మంచులా చల్లగా ఉందతని శరీరం. రాజారావు మరణవార్త క్షణాల్లో అందరికీ తెలిసిపోయింది.

హోం నిర్వాహకులు రాజారావు కొడుక్కు నాలుగైదుసార్లు ఫోన్‌చేశారు. అతను అందుబాటులో లేడని పనివాళ్లు చెప్పారు. శవం అట్టిపెట్టడం వీలుకాదు. కారణం హోంలో ఉండేది వృద్ధులు. వారికెలాంటి అనారోగ్యమూ ప్రబలకూడదు. అందులో భాగంగా రాజారావు శవానికి వెంటనే సమీప శ్మశానానికి తరలించారు. క్షణాల్లో దహనానికేర్పాట్లు చేశారు. విద్యావతి కొడుకు రాకకై ఆశగా, ఆర్తిగా చివరి నిముషం వరకూ చూసింది. శవాన్ని నిప్పెట్టారని ఓ వృద్ధుడు చెప్పేసరికి ఆమె బోరున విలపించింది.

తన భర్త కల నిజమైంది. కానీ తన కల... నిజం కాకూడదు. అలాంటి కొడుకు పంచన తాను బతక్కూడదు. ఈ దేవాలయమే తనకు పెద్దదిక్కు. ఇక్కడి వారంతా తన వారే అనుకుంటూ కన్నీళ్లు తుడుచుకుంది.

*

పప్పెట్ ఇంటర్వ్యూ

ఉదయశంకర్

దంచు... దంచు...

యుగాలుగా భేతాళుణ్ని మోసిమోసీ భుజాలు నొప్పులతో, ప్రశ్నలకు సమాధానాలు చెప్పీచెప్పలేక తల ఎన్నివేల ముక్కలో అయితే ఏరితెచ్చుకుని అతికించుకోలేక శోషకొచ్చి మర్రిచెట్టు తొర్రలో తొంగున్నాడు విక్రమార్కుడు. ఈ ముసురు సమయంలో భేతాళుడి కంటబడకుండా ఉంటే బాగుండునని తొర్రలోకి మరింతగా ముణగదీసుకున్నాడు కూడా.

భేతాళుడు బి తాళ్‌గా, నేటి మీడియా జర్నలిస్టుగా కొద్దిపాటి అనుభవాన్ని రుచి చూసేటప్పటికి తన యుగాలనాటి అలవాట్లకంటే నేటి కంప్యూటర్‌యుగపు టేస్ట్‌లబ్బాయి. తనకొచ్చిన ఆ కాలపు మాయలట్రిక్స్‌తో నేటియుగపు టీవీ స్క్రీన్‌ని మాత్రమే ప్రత్యక్షమయ్యేట్లు చేసుకుని పాటలు చూస్తున్నాడు.

"ఇన్నాళ్లకు గుర్తొచ్చానా వానా...ఎన్నాళ్లని దాక్కుంటావు పైన" అని వస్తున్నపాట దృశ్యానికి తానూ డ్యాన్సుచేస్తున్నాడు. ఆడియో లేనందున పాటను తానే గట్టిగా హమ్ చేస్తున్నాడు. అదివిన్న విక్రమార్కుడు వి మార్క్ అయి తొర్రనుంచి బయటకొచ్చినవాడై, "వ్వాటార్యూ డూయింగ్ మిస్టర్ తాళ్. అసలే రాష్ట్రమంతా తుపాను, పెనువర్షాలు, వరదలతో ఇంకా జనం తేరుకోలేక ఛస్తుంటే...ఇన్నాళ్లకు గుర్తొచ్చానా వానా అని, ఎన్నాళ్లని దాక్కుంటావు పైన అని పాడతావా?" అని కూకలేశాడు. వెంటనే ఛానల్ మార్చి మరో పాటపెట్టి తాళానికి తగ్గట్టుగా తాళం వేస్తూ ఆ పాట కూడా అందుకున్నాడు బి తాళ్. "...దంచవే మేనత్తకోడలా...దంచూ దంచూ...బాగా దంచు...దంచు దంచు దంచు దంచు..."

"ఆపరా నాయనా ఆ దంచుడు ఆపు..." అదేపనిగా దంచు దంచు అంటే విన్నవాళ్ళు మున్సిపల్ ఎన్నికల పోలింగయిపోయినా వీధిఉపన్యాసాల హోరు తగ్గలేదా అని జనం మళ్లీ బెదిరిపోతారు."

"అదేంటి సారువాడూ...నేను దంచు దంచు అని పాడుకుంటే మున్సిపల్ ఎన్నికల గురించని ఎందుకనుకుంటారు?"

"ఎందుకేవిటీ...మొన్ననే వర్షాలు దంచాయా... నిన్నటిదాకా మున్సిపల్ ఎన్నికలని నాయకుల రోడ్ షోలు, వీథోపన్యాసాలు దంచారా...పోలింగ్‌లో ఓటర్లు బాలెట్లు దంచారా...ఇంకా నువ్వు దంచుడాపకపోతే దంచుడు అనంగానే గుర్తుకువచ్చే టిఆరెస్ నాయకులొచ్చారనుకుంటారు. 'ఇప్పుడేం దంచుతావు నాయనా' అంటూ రోకళ్లు చేతపుచ్చుకునొస్తారు."

"అవును గురూజీ...టిఆరెస్, టిజెయస్ నాయకులేంటి అదేపనిగా 'దంచుతాం దంచుతాం...నరుకుతాం నరుకుతాం' అంటున్నారు. తడిబియ్యం దంచి ఉండ్రాళ్లు చేయడానికా అంటే వినాయకచవితి వెళ్లిపోయింది. అడ్డంగా పెరిగిన చెట్లకొమ్మలు నరకడానికా అంటే ఎత్తైత్తు గణపతుల నిమజ్జనమూ అయిపోయింది. మరింక దేనికి ఈ దంచుడూ, నరుకుడూ... ఈ ప్రశ్నలకు సమాధానం..."



"తెలిసీ కూడా చెప్పకపోతే నా తల వెయ్యివక్కలౌవుతుంది, నువ్వు మళ్లీ చెట్టెక్కుతానంటావ్ అంతేనా...ఇదుగో మిస్టర్ బి తాళ్ ఆరోజుల్లో కాబట్టి ఏం చెప్పినా విన్నావు. ఇప్పుడలా కాదు. సమాధానం వాళ్లచేతే ఛెప్పిస్తే విని నమ్ముతావు. పద బయలుదేరు. ఎక్కడదాచావో ఆ కెమేరా, నా నోట్‌ప్యాడ్ పుచ్చుకు పదా" అంటూ ఇద్దరూ బయలుదేరారు.

xxx xxx xxx

వి.మార్క్ : సార్...మీ దంచుడుకి జనమెలా స్పందించారు సార్?

ఎన్ ఇంద్ర : లేలే...దంచుడు నేను కాదు బిడ్డా...గదో గక్కడ కూసున్న ఆయనే.

బి.తాళ్ : (తన కెమేరా అటు తిప్పి) పెద్దసారూ...గీ మురికిపాలిటెన్నికల్లో మీ నరుకుడు ఎంతవరకు వచ్చింది మా బివీ టీవి ప్రేక్షకులకు చెబుతారా...

కెసి శేఖర్రావు : మా దమాక్ ఖరాబయి కూసుంటే...మీరు ఇంకా తారుమారు చేస్తారేమయ్యా...నా పని దంచుడు...గాయన పని నరుకుడు. నన్ను దంచుడు గురించడుగుండ్రి. నరుకుడు గురించయితే నాకు తెల్వది. నా ఉద్దేశంల రెండూ నేటి ప్రత్యేక తెలంగాణా అవసరమంటాను.

వి మార్క్ : తెలంగాణా అవసరమంటారా...తెలంగాణా ప్రజల అవసరమంటారా? లేక మున్సిపలెన్నికల...

కెసి శేఖర్రావు : ఇదుగో ఇలాగే మమ్మల్ని కన్ఫ్యూజ్ చేయద్దని పాత్రికేయమిత్రులకు మా బల్ల దంచిమరీ చెప్పాను.

(కెమేరాలోంచి చూస్తున్న బి తాళ్ ఉలిక్కిపడి 'బల్లగుద్ది' అనక దంచడవేంటాని ఆశ్చర్యపోతుండగానే) తెలంగాణా కోసం దంచుడు అవసరమైతే దంచుడే అని సెప్టెంబర్ నాలుగన మీ విలేఖర్ల సమక్షంలోనే చెప్పాను. ఆ మాటకొస్తే గతంలోనే... అనేకసార్లు చెప్పిందే చెప్పాననిపించుకున్నా దంచుడే దంచుడని చెప్పానని చెపుతున్నాను. ఎవరవసరమని తిరకాసు ప్రశ్నడిగితే ఎట్లా...అది అందరి అవసరం. ప్రత్యేకతెలంగాణా అవసరం అంటే తెలంగాణా ప్రజలవసరమేనని మళ్లా బల్లగుద్ది అదే బల్లదంచి చెప్పాల్సివస్తుంది.

వి మార్క్ : గతంలో కూడా ఇలాగే దంచుడు అన్నందుకు అందరూ గట్టిగా కోరినమీదట ఆ పదాన్ని వదులుకున్నారని మా ప్రేక్షకులు గుర్తుంచుకున్నారని మనవి చేస్తున్నానండి. మీరేమంటారు?

కెసి శేఖర్రావు : మాకూ గుర్తుంది మిత్రమా...ఈ సందర్భంగా మరోసారి మీకు గుర్తుచేసేదేవిటంటే...మేమెన్ని త్యాగాలకైనా సిద్ధమేనని, మేమన్న ఏ మాటనైనా త్యాగశీలతతో ఎన్నిసార్లయినా వదులుకోవడానికి సిద్ధంగా ఉంటామని బల్లదంచుతున్నాం.

బి తాళ్ : (కెమేరా వెనుకనుంచే)అంటే మున్సిపల్ ఎన్నికల ముందు మళ్లా మొదలెట్టిన 'దంచుడు' ఈసారికూడా త్యాగంచేస్తారా?

కెసి శేఖర్రావు : ముందే చెప్పాను త్యాగాలకు వెనుకాడం అని. (ఇక నన్ను వదలమన్నట్లు...ఎన్ ఇంద్ర వైపు తిరిగాడు. కెమేరా అనుకున్నట్లుగానే అటు తిరిగింది)

వి మార్క్ : ఎన్ ఇంద్రగారు...జాగరణ్ సభలో నరకండి అనగానే కార్యకర్తల్లో వెయ్యేనుగుల పెట్టు ఉత్సాహం ఉరకలేసిందని మా కెమేరా గమనించింది. మీరేమంటారు?

ఎన్ ఇంద్ర : అవును. అసలు మేమలా అన్నదే కార్యకర్తల్లో జరంతన్నా ఉత్సాహం ఉరకలు పరుగులువెట్టేందుకే అంటిని. మరింత జోష్ వస్తదనే కర్రలు తీసుకోండని అంటిని. ఇంకా నెత్తురు వేడెక్కాలని 'నల్లత్రాచుల్లా కాటేస్తాం... తెలంగాణా తల్లి కొంగుకి నిప్పెట్టేవాళ్ల తలనరికి ఆ రక్తంతో తెలంగాణా తల్లి పాదాలకు అభిషేకం చేస్తామని కూడా అన్నాను. ఇగ జూసుకోండ్రి...సప్పట్లే సప్పట్లు, ఈలలే ఈలలు.

వి మార్క్ : కానీ సాధారణ తెలంగాణా ప్రజలు, మేధావులు ఈ నరుకుడు, దంచుడు అనే పదాలు వాడటం సరైంది కాదని, అలా మాట్లాడ్డం వల్ల తెలంగాణా ఉద్యమానికేం లాభం లేదని అంటున్నారు.

ఎన్ ఇంద్ర : మా తెలంగాణా వాళ్లకు మున్సిపల్ ఓట్ల లెక్కింపు తర్వాత సమజాయించుకుంటాం. మా మేధావులు అలా మాట్లాడితే మేం ఏం చేస్తాం. ఎన్నికల్లో ఓట్లు రాలాక వాళ్లకు తెలుస్తాది లెమ్మని ఊకుంటున్నాం. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ అలసటతో మాగన్నుగా నిద్రపోతున్న కెసి శేఖర్రావు, ఎన్ ఇంద్ర ఇద్దరూ తమకేదో పీడకల వచ్చినట్లనిపించి ఒకేసారి ఉలిక్కిపడి లేచారు. వాళ్లు లేవకముందే వి మార్క్ విక్రమార్కుడుగా, బి తాళ్ భేతాళుడుగా యథారూపాన తమ కేరాఫ్ అడ్రస్సు మర్రిచెట్టు వద్దకు వెళ్లారు.

తెంగ్లీష్

డా.జెపి.వైద్య

"గన్పతి బప్పా... వాటర్ బిందెలు..!"

ఊరు మొత్తం పండగ వాతావరణంలో 'గులాల్' చల్లుకున్నట్టుంది. ఎటు చూస్తే అటు 'ధన్ ధనా ధన్ ధన్నన్..' అన్న బాండు మోత...

నిన్నటి దాకా 'గణపతి బొప్పా మోరియా..' అన్న గొంతుల పాట...ఎటు చూస్తే అటు రంగురంగుల దీపాలూ..రంగురంగుల ఝండాలూ...రంగురంగుల తోరణాలూ... గుర్తు పట్ట వీలుకాని మొహాలు!

బొజ్జ గణపతయ్య నిమజ్జనం...వేలవేల ప్రజలకు కాస్తంత దిగులు కల్గించేది ఇంతకు ముందు...గణపతుల పేర్న సాయంత్రం కోలాహలం..రాత్రి 'రోషనాయీ'...ఏం చేసినా చేయకున్నా సాయంత్రం పూట సమయం హారతి కర్పూరంగా ఎగిరిపోయేది ఇది వరకు...నిమజ్జనం అయ్యాక గుండెలో ఏమూలో 'లబ్‌డబ్' కాస్త తక్కువ స్పీదులో కొట్టుకుంటున్నదేమో అన్న ఫీలింగ్ ఉండేది...

ఎలెక్షన్లూ+వినాయకుడూ కలిసి వచ్చేసరికి రంగు ఇంకాస్త ముదిరిపోయినట్టన్పించింది...వినాయకుల వారు 'టంచన్'గా టైం పూర్తయ్యేసరికి 'సాగరో' - 'చెరువో' - వాగునో చూసుకొని 'వచ్చే సంవత్సరం మళ్లీ వస్తాను లేవోయ్' అని చెప్పి వెళ్లిపోయారు...

వినాయకుల వారు విద్వాంసులు కదా..! చదువూ, సంధ్యలూ, సంస్కారం, పంక్చువాలిటీ గట్రా తెలిసిన వారు..టంచన్‌గా 'టైం'కాంగానే 'ఓకే ! బై..!' అని చక్కా వెళ్లిపోయారు.

నాయకుల సంగతి వేరే కదండీ! వాళ్లు 'ప్రస్తుతం' ఏ 'రంగు'లో - ఏ 'పార్టీ'లో ఉన్నారో పక్కవాళ్లు జ్ఞాపకం చేయ్యాల్సి వచ్చే తరుణం...!

'రూలింగ్'లో ఉన్నవాళ్లు కూడా అలవాటు కొద్దీ - 'ఆఁ! వాట్ ది హెల్ ది గవర్మెంట్ ఈజ్ డూయింగ్ ఇనీ! మనం అందరం ఓటిచ్చాం...గెలిపించాం...హాయిగా అధికారం చేతపుచ్చుకొని సింహాసనం మీద కునుకులు తీస్తావుంటే వూరుకునేది లేదు..' అని వీర విజృంభణ చేసే నాయకులకు, పక్కనున్న 'చమ్చాలవారు' సవినయంగా జ్ఞాపకం చేయ్యాల్సి వస్తుంది..తప్పదు మరి!

"...ష్..! సార్...! మనం ప్రస్తుతం మనమ్ ఆర్ రూలింగ్ మే హై సార్..." అని..! తెలివైన నేత వెంటనే తెలివిగా గొంతు సవరించుకొని ప్లేట్లూ, ప్లాటూ మార్చేసి చెప్తారు...

"హుఁ! ఈ మాటే కదా.. ఆ అపోజిషన్ వాళ్లు మాటిమాటికి మా వైపు విసిరి కొట్టేది? అయ్యా! అపోజిషన్ ఏమిటీ? కంస్ట్రక్టివ్ అపోజిషన్ ఉండాలి! క్రియాత్మకంగా మెదలాలి..! ప్రతి పనికీ - అయిన దానికీ - కాని దానికీ అంటే ఎలా? మాకు తెలియదా ఏమి - ఈ ప్రజలు మాకు ఓటిచ్చి గెలిపించారు...ఈ సీటు వాళ్లది..ఈ ప్రాణం వాళ్లది...ఈ దేహం వాళ్లదీ..ఈ జీవితం వాళ్ల కోసమే ! నా శరీరంలో అఖరు రక్తం బొట్టు కూడా ధారపోసైనా సరే - మీ కంటిలో ఆనందం చూసే దాకా మీ సేవలోనే ఉంటానని మనవి చేస్తున్నా' అని హడావుడిగా స్టేజి దిగిపోతారు...

'ఏవిట్రా? హడావుడిగా స్టేజి దిగిపోయాడు గురుడూ?' అని యమ హాశ్చర్యంగా నోరు వెళ్లబెట్టిన వాళ్లకు అసలు కారణం తెలియదు అసలు ఏ మీటింగో? ఎజెండా ఏమిటో? అన్నది కూడా తెలుసుకోక ఊకదంపుడు లెక్చరిచ్చే ఘరానా లీడర్లకు...అయ్యా! మన పవిత్ర దేశంలో కరువెప్పుడూ? ఇప్పుడూ వచ్చాయి ఎలెక్షన్లు ! లీడర్ల గుండెల్లో రకరకాల భావాలు! వెళ్తే - 'ఇన్నాళ్లు మొహం చూయించక ఎక్కడ చచ్చావూ?' అనడిగే వాళ్లుంటారు..ఖాళీ బిందెలతో వీపు వాయించే వాళ్లుంటారు. టొమాటోలూ, గుడ్లూ దండగ చేయడం ఎందుకు అని భావించి పేడనీళ్లతో 'హారతులిచ్చి' అలాంటిదే ఏదో పులమడానికి సిద్ధంగా ఉన్నారు ప్రజలు.

అందుకోనం ఓ అయిడియా వేసుకున్నారు పెద్దోళ్లు...ముందే మెడలో మొహం కన్పించనంత 'జోరు'గా హారాలు వేసుకొని ఆ దండల వెనక 'దండ నాయకుల' కోలాటాలు మొదలెట్టారు...

'నా కాన్సెస్టెంటుకూ ఎళ్లు గురూ..! నీ ఏరియాకు నే వెళ్త... ఏ ప్రశ్న లడిగినా, 'అరే ! గట్లనా! తెల్వదు భై...! కనుక్కుంటా' అని తప్పించుకోవచ్చు గురూ ! ఇదో ! మా కోస్తాకెళ్లు ! మా తెలంగాణా వెళ్ళు ! నేనలా రాయలసీమకై పోతా!'

'ప్రెజలు చిన్నోళ్లు కారన్నా! ఆయ్‌ఁ! గిటొచ్చినవ్? అంటరు'

'అననీ భై ! మన బాడీ గార్డున్నరు గద...వాళ్లెనక నిలవడి ఈ 'ఏరియా' స్టడీ చేయనీకి వచ్చిన తమ్ముడూ..! అంట..! గిన్నేళ్లు రాజకీయం చేశినం..ఎట్ల జారుకోవాల్నో తెలవదా భై' ...అనే నాయకులకూ కొదువ లేదు..!

కాని, ఎక్కడో, ఎవరో, ఎక్కడ్నించో వచ్చి 'బాంబు' పేల్చేవాళ్లుంటారు...

'ఎక్స్క్యూజ్ మీ...సర్! యూ నో నన్నయ్య? యూ నో తిక్కనా? యూ నో ఎర్రాప్రగడా? నోనో..నో...! దే ఆర్ నాట్ ఆపోజిషన్ క్యాండిడేటస్ సర్? దే ఆర్ అవర్ పీపుల్స్ ఓన్లీ ! కవుల్స్ వోన్లీ ఆఁ యూ వాంట్ టూ 'సత్కార్' దెమ్? వార్నీ ! దే ఆర్ నాట్ అవెలెబుల్ ...! యూ కెన్ మీట్ దెమ్? ఆన్ ట్యాంక్ బండ్! బట్ ! డోంట్ గో నౌ ఇమ్మీడియట్లీ..! రిసెంట్లీ వినాయకాస్ వర్ నిమజ్జనడ్...! దేర్ మే బీ లాట్ ఆఫ్ కన్‌ఫ్యూజన్ ! పీపుల్స్ స్టిల్ కమ్ టు సీ - వెదర్ దేర్ వినాయకా ఈజ్ టోటల్లీ మునిగింగ్ ఆర్ నాట్ ! ఇఫ్ దే సీయూ...అండ్ దేర్ వినాయకా నాట్ మునిగింగ్ టోటల్లీ...దెన్ యూ విల్ బి మునుగుడో మనుగుడు ! ఎనీ వే ! నన్నయ్యా - తిక్కనా - ఎర్రాప్రగడా గేవ్ అజ్ 'మహాభారతా'...ఇన్ నేటివ్ తెల్గూ...! యూ ఆర్ క్రియేటింగ్ మహాభారతా !కృష్ణా సెడ్ ! ఐ యామ్ ఎవ్రీ థింగ్ ! యూ టూ సే...! ఆఁయూ ఆర్ కృష్ణా? ఆర్ యూ? దెన్ ఫర్‌గెట్ అబౌట్ మహాభారతా...! టెల్ మీ వ్వెర్ ఆర్ గోపికాస్! కమాన్!.."ఒళ్లు మండి ఇంగ్లీషులో పొగమంట పెట్టిన పెద్దాయన వెనక ఖాళీబిందెలు తీసుకొచ్చి 'బిందె బాట' నిర్వహిస్తున్న ఓటరుగోపికలు కస్సుమంటూ లేచారు...!

'వాటర్ వాటర్ ఎవ్రీ వ్వెర్...! వ్వెర్ ఈజ్ వాటర్ ఇన్ ది బిందే!' అంటూ బుస్సోకస్సో...కస్సోబుస్సో!

కానీ నిమజ్జనం ప్లేసులల్ల గణపతిబప్పా మునిగేందుకే నీల్లు చాలకపోయె. కుర్సిన వానలనీరు నిలిపే శ్రద్ధలేక జనాల్ని నిమజ్జనం చేస్తాయోమనని, పోయి సముద్రంలో కలువమని గేట్లు తెరుసుడాయె! ఇంగ మునిసిపల్‌ఓట్ల వాగ్దానమ్సకి నీళ్లు బిందెల్లోకెల్లేదెట్లో దెల్వక వైట్‌ఫేస్ పెట్టెనొక లీడరుడు.

*



ఓ ఊరి కథ

హేమలత

చారిత్రక వైభవం 'కనిగిరి దుర్గం'



దూరంగా కనిపిస్తున్న ఆ కొండను చూస్తే...పైభాగాన అస్పష్టంగా కనిపిస్తున్న కట్టడంపై మన చూపు క్షణకాలం నిలచిపోతుంది. కొద్దిసేపు పరిశీలిస్తే... అదో ఆలయమని తెలుస్తుంది. దీని పక్కనే ఓ నీటి దొన ఉండేదట! మండువేసవిలోనూ మంచినీళ్లు కావాలంటే ఆ దొన దగ్గరికి వెళ్లితీరాల్సిందేనని ప్రజలు చెప్పకుంటారు. సరిగ్గా ఇక్కడి నుండి రెండు కిలోమీటర్లు నడిస్తే... మరికొన్ని దేవాలయాలు, ఓ రాజభవనం, మందుగుండు సామాగ్రి దాచుకునే శాల...., గుర్రాలశాల, ఏనుగుల శాల కనిపిస్తాయి. ఈ రాజభవనంలో ఓ విశాలమైన కోనేరుంటుందిట! దీన్ని శ్రీ కృష్ణదేవరాయులు భార్య చిన్నమదేవి నిర్మించినట్లు ఇక్కడి ప్రజలు భావిస్తారు.

ఇక్కడేదో రాజభవనమున్నట్టుందే...అని మాత్రం అనుకోకండి! ఎందుకంటే... పైన చెప్పినవన్నీ మీకు కనిపించేది శిథిలావస్థలో...! అంటే వీటి ఆనవాళ్లు మాత్రమే! అవును. నేడు కనిగిరి దుర్గంగా ప్రజల నోళ్లలో నానుతున్న ఈ ప్రాంతం ఒకప్పటి విజయమార్తాండ దుర్గం! ఈ దుర్గాన్ని పాలించిన వీరభద్రగజపతి ఈ కనిగిరి కొండపై మార్తాండేశ్వర ఆలయాన్ని నిర్మించాడట!.

ఒకప్పుడు ఈ కనిగిరి దుర్గం ఎంతో వైభవంగా ఉండేది. కాలక్రమంలో రాజులు గతించారు. వారి రాజ్యాలూ పోయాయి. వారు నిర్మించిన ఆలయాలు... శిథిలావస్థకు చేరాయి. కోటగోడలు కూలిపోయాయి. ద్వారాలు చెల్లాచెదరయ్యాయి. బురుజులన్నీ పడిపోయాయి. దుర్గానికెళ్లేందుకు కొండమీదుగా నిర్మించిన మెట్లు శిథిలమయ్యాయి. ఎక్కడ చూసినా నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. ఇదంతా ఎలా సంభవించిందో తెలుసుకోవాలనుందా.....

అది 13,14 శతాబ్దాల మధ్య కాలం... కాటమరాజు విజయమార్తాండ దుర్గాన్ని పరిపాలిస్తున్నాడు. కొన్ని సంవత్సరాల తరువాత... ఈ ప్రాంతం తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితుల్లో చిక్కుకుంది. ప్రజలు అట్టుడికిపోయారు. పంటపొలాలెండిపోయాయి. పచ్చదనం హరించుకుపోయింది. కళ్లముందే పశుసంపద అంతరిస్తోంది. దాంతో కాటమరాజు కలతచెందారు. వెంటనే నెల్లూరుసీమను పాలిస్తున్న మనుమసిద్ధిరాజును కలిశాడు. "మా పశువులను మీ పచ్చికబీళ్లలో మేపుకునేందుకు అనుమతించండి" అని కోరాడు. దీనికి 'పుల్లరి'గా ధనం చెల్లిస్తానన్నాడు. కాటమరాజు చేసిన ఈ ప్రతిపాదనకు మనుమసిద్ధిరాజు ఒప్పుకున్నాడు. కొద్ది రోజులకు పరిస్థితులు కుదుటపడ్డాయి. ఒప్పందం ప్రకారం 'పుల్లరి' చెల్లించడానికి కాటమరాజు నిరాకరించారు. "కనీసం మీ బొల్లావునైనా ఇవ్వండి" అని మనుమసిద్ధిరాజు కోడలైన కుందుమాదేవి కాటమరాజును కోరారు. దానికీ ఆయన నిరాకరించారు. ఫలితంగా కుందమాదేవి ఆగ్రహించింది. కామరాజు పశువుల్లో కొన్నింటిని ఊచకోత కోయించింది. దీంతో



కాటమరాజుకు, మనుమసిద్ధికి మధ్య వివాదాలు భగ్గుమన్నాయి. కనిగిరికి తూర్పువైపున 13కిలోమీటర్ల దూరంలోని పాలేరు ఒడ్డున వీరిరువురికీ భీకర యుద్ధం సంభవించిందని ప్రజలు చెప్పుకుంటారు. దీనిలో కాటమరాజు విజయం సాధించినట్లు చరిత్ర చెబుతోంది. కాటమరాజు తర్వాత ఈ దుర్గాన్ని గజపతులు పాలించారనీ, వీరి కాలంలోనే ఈ ప్రాంతమభివృద్ధి చెందిందనీ ప్రజలనుకుంటారు. క్రీస్తుశకం 1513లో శ్రీ కృష్ణదేవరాయులు తన జైత్రయాత్రలో భాగంగా ఉదయగిరి, కనిగిరి, కందుకూరు, వినుకొండ, అద్దంకి ప్రాంతాలను జయించాడు. ఆయన మరణానంతరం కందుకూరు రెడ్డిరాజులు ఈ ప్రాంతాన్ని పాలించారు. అనంతరమిది సుల్తానులు ఏలుబడిలోకెళ్లింది.

1772లో హైదరాలీ ఆదోని నవాబుపై దండెత్తి కనిగిరి కోటనాక్రమించుకున్నారు. ఈ సందర్భంలోనే టిప్పుసుల్తాన్ మరణించాడు. అనంతరం వెల్లస్లీ సైన్యసహకార పద్ధతిని ప్రవేశపెట్టాడు. హైదరాబాద్ నిజాంనవాబు కనిగిరి దుర్గాన్ని బ్రిటీషువారికి ధారాదత్తం చేయడం ఈ పద్ధతి అమలుకు నిలువెత్తు సాక్ష్యం.

*



అవీ... ఇవీ

రక్త చారికల రోడ్డు

అవిశ్రాంతంగా అలసి సొలసి అరిగిపోయిన
జీవన రహదారిపై
ప్రమాదమైన వేగాన్నే శ్వాసిస్తున్న ప్రయాణంలో
కళ్ళముందే గభిల్లున జారిపడుతుంది జీవస్పర్శ
సిరాతో నిండిన గాజుబుడ్డి భళ్ళున పగిలినట్టు
"చాపెలుపు" భూ శంకలంపై ఎర్ర మట్టితో
అలికినట్టు
ఆక్రందిస్తూ ప్రవహిస్తుంది నెత్తుటి వరద
చేయూత నిచ్చి సేదదీర్చవలసిన ఆదరణ
పెదవుల కదలికకే పరిమితమౌతుంది
జాతికో,సానుభూతికో సంకేతమైనట్టు
ఒక నిష్ప్రయోజన మూలుగు నిట్టూర్పుగా
వినబడుతుంది
గుంపులు గుంపులుగా చేరిన యాంత్రిక దేహాల
మధ్య మాటలు కోటలు దాటతాయి
చేతలు చేతివేలు కొసను కూడా చేరవు
గిరుక్కుమనే ఆటో తూనిగల్ని
నాలుక చాచి చుట్టేస్తూ
లారీ రాక్షస బల్లులు
ఎగబడు తూనే ఉంటాయి.

\- పోతగాని
సత్యనారాయణ

తాగు బోతు పిల్లలు

గత పదిహేను సంవత్సరాలలో బ్రిటన్‌లో తాగుబోతు పిల్లల సంఖ్య రెట్టింపయ్యిందని తాజా సర్వేలో తేలింది. (అంటే అక్కడ కూడా బెల్టు మద్యం షాపులున్నట్లే) పదకొండు-పదిహేను సంవత్సరాల మధ్య వయస్సు వారిలో తాగుడు, మాదకద్రవ్యాల వినియోగం, పొగతాగటం గురించి ప్రభుత్వం సర్వే చేయించింది. గత వారంలో మద్యం తాగిన వారెందరని అడగ్గా తాము తాగామని 50శాతం మంది అమ్మాయిలు, 42శాతం అబ్బాయిలు చెప్పారట. వారిలో 23శాతం మంది పిల్లలు రోజూ తాగుతున్నారని కూడా తేలింది. తాగటంలో ఆడపిల్లలు పోటీపడుతున్నారు. తాగే మొత్తం కూడా దాదాపు రెట్టింపయ్యింది. ప్రభుత్వం, ప్రైవేటురంగంలోని 313 స్కూళ్లలో 9700 మంది పిల్లలను ప్రశ్నించి ఈ సమాచారాన్ని రాబట్టారు. ఈ పరిణామాన్ని పసిగట్టిన సూపర్ మార్కెట్‌లు ఆదాయాన్ని పెంచుకొనేందుకు రోజంతా మద్యాన్ని విక్రయించేందుకు అనుమతించాలని దరఖాస్తు చేస్తున్నాయి. పదిశాతం అమ్మాయిలు, ఏడుశాతం అబ్బాయిలు రోజూ పొగతాగుతున్నారని కూడా సర్వే వెల్లడించింది.

\-ఎంకెఆర్



మన్ను తిన్న గోపాలుడు
నోరు తెరిస్తే ముల్లోకాలు
కనబడ్డాయో లేదో మరి !
నేటి కంప్యూటర్ నోరు
తెరిస్తే మూడు వేల
"లోకల్స్" కనబడున్
తథాస్తు ! అమెన్ !

విజ్ఞాన వీచిక

పదార్థం గురించి తెలుసుకోవడమే విజ్ఞాన శాస్త్రం. భౌతిక శాస్త్రాలైనా, జీవశాస్త్రాలైనా, సామాజిక శాస్త్రాలైనా....పదార్థం గురించి, దాని లక్షణాలను గురించి వివరించడమే వాటి పని.

ఎస్. వెంకట్రావు

శాస్త్రం - విజ్ఞానం



శాస్త్రవిజ్ఞానం అంటాం. విజ్ఞానశాస్త్రం అంటాం. ఈ మాటవినగానే మన మనసులో మెదిలేవి ఫిజిక్సు, కెమిస్ట్రీ, బయాలజీ వంటి సైన్సుకు సంబంధించిన శాఖలే. మానవజీవితాన్ని గురించి చెప్పే ఇతర సామాజిక శాస్త్రాలూ విజ్ఞాన శాస్త్రాలేనన్న విషయం మనకు వెంటనే తట్టదు. ఒక వేళ తట్టినా అవేవో రెండో గ్రేడ్ సైన్సు విషయాలుగా పరిగణిస్తుంటాం. కాని విషయమేమిటంటే ఫిజిక్సు, కెమిస్ట్రీలు ఎంత విజ్ఞాన శాస్త్రాలో సామాజిక శాస్త్రాలూ అంతే విజ్ఞాన శాస్త్రాలు. కొన్ని శాస్త్రాలు గొప్పవీ, కొన్ని తక్కువని ఏమీలేవు. ఇటీవల మన సమాజంలో సామాజిక శాస్త్రాలపట్ల చిన్నచూపు పెరుగుతున్నందున ఇప్పుడు సామాజిక శాస్త్రాల అవసరాన్ని, ఔన్నత్యాన్ని పలుమార్లు నొక్కి చెప్పాల్సి వస్తోంది. అయితే విషయమేమిటంటే సామాజిక శాస్త్రాలు లేకుండా విజ్ఞాన శాస్త్రం లేదా శాస్త్ర విజ్ఞానం సంపూర్ణం కాదు! ఎలాగంటారా?

"పదార్థం" అంటే ఏమి లేదు గురూ...

పదార్థం గురించి తెలుసుకోవడమే విజ్ఞాన శాస్త్రం. భౌతిక శాస్త్రాలైనా, జీవశాస్త్రాలైనా, సామాజిక శాస్త్రాలైనా....పదార్థం గురించి, దాని లక్షణాలను గురించి వివరించడమే వాటి పని. భౌతిక శాస్త్రాలను ఇంగ్లీషులో ఫిజికల్ సైన్సెస్ అంటూన్నారు. భౌతిక శాస్త్రం (ఫిజిక్సు), రసాయనిక శాస్త్రం (కెమిస్ట్రీ), ఖగోళశాస్త్రం (ఆస్ట్రానమీ)..ఇలా ఇందులో అనేక విభాగాలు ఆ విభాగాల్లో మళ్లీ



ఉపవిభాగాలు వందల సంఖ్యలో ఉన్నాయి. జీవశాస్త్రం కూడా అంతే. నేచురల్ సైన్సెస్ అని ఇంగ్లీషులో పేర్కొనే ఇందులో మళ్లీ వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, వైద్యశాస్త్రం...వగైరా సవాలక్ష శాఖలున్నాయి. సామాజిక శాస్త్రాల్లో కూడా అనేక శాఖలున్నాయి. అయితే స్థూలంగా చూస్తే మానవుని గతాన్ని తెలిపేది చరిత్ర అయితే వర్తమానాన్ని తెలిపేవి ఇతర సామాజిక శాస్త్రాలు. వీటిలో మళ్లీ ఆర్థిక శాస్త్రం, వాణిజ్య శాస్త్రం, మానవ సంబంధాలకు సంబంధించిన అనేక శాఖలున్నాయి. ఎన్ని శాఖలున్నా వీటన్నిటి పనీ పైన చెప్పినట్లు పదార్థం గురించి తెలియజెప్పడమే. మరి పదార్థం గురించి తెలియజెప్పడమే అంటే ఒకే శాస్త్రం ఉండాలి గాని ఇన్ని శాస్త్రాలు, లేక ఇన్ని విజ్ఞాన శాస్త్ర శాఖలు ఎందుకొచ్చాయన్న సందేహం కలగడం సహజం.

మనిషి కూడా పదార్థమేనంటా !

పదార్థం ఒకే రకంగా లేదు కాబట్టి, అనేక రూపాల్లో, అనేక రూపాంతరాల్లో ఉంది కాబట్టి దాన్ని తెలుసుకోడానికి ఇన్ని శాస్త్రాలు పుట్టుకొచ్చాయి. పదార్థం నిరంతర చలన శీలమైంది. అది ఒకే రూపంలో నిలకడగా ఉండదు. పరిణామం చెందుతుంది. ప్రాథమిక స్థితి నుండి ఉన్నతమైన స్థితికి పరిణామం చెందుతుంది. సరళమైన స్థితినుండి సంక్లిష్ట స్థితికి రూపాంతరం చెందుతుంది. అందువల విజ్ఞాన శాస్త్రం మొత్తంగా పదార్థం గురించే చెప్పేటప్పటికీ పదార్థం అనేక రూపాల్లో, అనేక స్థితుల్లో ఉంటుంది కాబట్టి అనేక రకాల విజ్ఞాన శాస్త్ర విభాగాలు అవసరమైనాయి. మానవుడు కూడా పదార్థం నుండి ఆవిర్భవించిన వాడే. పదార్థపరిణామంలో ఒకానొక రూపమే మానవుడు. ఇంకో మాటలో చెప్పాలంటే పరిణామంలో ఉన్న పదార్థం యొక్క ఉన్నత రూపమే మానవుడు. మానవుని మెదడు, అతని ఆలోచనలు కూడా పదార్థ రూపాలు మినహా మరోటి కాదు. అందువల్ల మానవ సమాజాన్ని గురించి తెలుసుకోవడం అంటే పదార్థం యొక్క ఒకానొక ఉన్నత రూపాన్ని గురించి తెలుసుకోవడమే. అందుకే సామాజిక శాస్త్రాలు కూడా ఇతర శాస్త్రాల మాదిరిగానే పక్కా విజ్ఞానా శాస్త్రాలైనాయి. *

విజ్ఞానశాస్త్రంలో భాగాలు , విభాగాలు గురించి వచ్చే వారం...

ఇమ్మర్ష

వామపక్ష భావాల పట్ల ప్రభావితులై మార్క్సిస్టు అవగాహనతో క్రియాశీలకోద్యమాల్లో పాల్గొంటూ తన కాలాన్నీ, కలాన్నీ ఉద్యమానికి అంకితం చేసిన నిబద్ధరచయితగా, కార్యకర్తగా, సంపాదకురాలిగా రత్నమాలగారు సాహిత్యలోకానికి చిరపరిచితులే.

సామాజిక సమస్యల పట్ల విస్తృతమైన అవగాహనతో, తక్షణ స్పందనతో విశ్లేషణాత్మకంగా వ్యాసాలను తీర్చిదిద్దడం వారి ప్రత్యేకత. వ్యవసాయరంగ సంక్షోభం, రైతుల ఆత్మహత్యలు, మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆకలి చావులు, దత్తత పేరుతో పసిపిల్లల క్రయ విక్రయాలు, టూరిజం పేరుతో విస్తరిస్తున్న వ్యభిచారం, ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రశ్నార్థకంగా మారిన పౌరహక్కులు, బూటకపు ఎన్‌కౌంటర్లు, జనాభా భూతం సంపన్న దేశాల సృష్టి. ఇలా ప్రతి వ్యాసాన్నీ సమగ్రంగా తీర్చిదిద్దారు. దాంతో ఈ వ్యాసాలన్నీ సమకాలీనతను సంతరించుకున్నాయి. ఆలోచనాత్మకంగానూ తయారయ్యాయి.



ఇమ్మర్ష
ఎం. రత్నమాల
వెల రూ. 70/-పేజీలు : 237
ప్రతులకు-నూతన ప్రచురణలు,
మేఘ అపార్ట్‌మెంట్స్,
ప్లాట్ నెం. 302,
నల్లకుంట,హైదరాబాద్

మహిళా సమస్యల పట్ల, వాటి పరిష్కారాల పట్ల స్పష్టమైన అవగాహనతో, సాధికారికంగా విశ్లేషించిన తీరు ప్రామాణికంగా ఉండే పాఠకులనాకట్టుకుంటుంది. మహిళావాదులు, మహిళావిముక్తి వాదులు ఏవో కొన్ని సమస్యలకే పరిమితమై ఆర్భాటాలు చేస్తుంటారు. ఈ ధోరణిని రచయిత్రి నిరసించారు. "మద్యనిషేధం" ఒకటేనా మహిళా సమస్య?", "రైతుల ఆత్మహత్యలు స్త్రీల సమస్య కాదా?" అని ఆమె వ్యాసాల్లో ప్రశ్నించడం మనల్నాలోచింపజేస్తుంది. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంతో పాటు సాగిన మహిళా ఉద్యమం, "తెలంగాణా సాయుధ పోరాటం - స్త్రీలు" అనే వ్యాసాలు ఎన్నో కొత్త విషయాలు తెలియజేశాయి. వివిధ సామాజిక రంగాలలో స్త్రీల గురించి వివరించడంతో పాటు మహిళాకార్మికులు - వారి పరిస్థితులు, ఉద్యోగినుల పనివేళలు, బీడీ కార్మికులు బతుకు పోరాటం, పేద, దళిత స్త్రీల సమస్యలపై పరిష్కారాన్ని ఈ వ్యాసాల ద్వారా తెలియజేసిన తీరు బాగుంది. పురుషాధిక్యపు ధోరణుల నుండి పత్రికలు నేటికీ బయటపడలేదనీ, జర్నలిజం కోర్సుల్లో మహిళా దృక్పథంపై ప్రత్యేకంగా పాఠ్యాంశాలను ప్రవేశపెట్టాల్సిన అవసరాన్ని తెలియజేశారు. స్త్రీ విముక్తిని మార్క్సిస్టు దృక్పథంతోనూ, స్త్రీవాద దృక్పథంతోనూ విశ్లేషించిన వ్యాసాలూ ఉన్నాయి. స్త్రీలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న అన్ని రకాల సమస్యలపై సాధికారికంగా వ్యాసాలు రాసిన ఈరచయిత్రిని మార్క్సిస్టు ఫెమినిస్టుగా అనాలి.

ఫెమినిస్టుల ఆరాధ్య దైవమైన చలంలోని లోపాలను ఎత్తి చూపడంలో రచయిత్రి ఏ మాత్రమూ వెనకాడలేదు. సాంస్కృతిక పురోగమనానికి చలం భావజాలం ఎంతగానో దోహదం చేసిందనే వ్యాసం ఒకటి కాగా చలం స్త్రీ పాత్రలు వ్యక్తిత్వం లేనివాళ్లనీ, పురుషత్వం ముందు లొంగిపోయిన వాళ్లని సోదాహరణంగా ఇంకో వ్యాసంలో నిరూపించారు. దానితో పాటు "వేలాడిన మందారం" నవలను విమర్శించిన తీరు ఆకట్టుకుంది. కఠోర షడ్జమాలు, కాళోజి, కోశాంబి మీద రాసిన వ్యాసాలు కూడా బావున్నాయి. రెఫరెన్స్ విలువను సంతరించుకున్న ఈ వ్యాసాలు తప్పకుండా చదవదగినవి.

- కె.పి అశోక్ కుమార్.

స్వీకారం



ది రాయల్ సీల్
రచన : భమిడిపాటి ప్రసాదరావు
వెల : 60/-, పేజీలు : 104
ప్రతులకు : తుమ్మపాల-531 032
సుజాత ప్రచురణలు
33-16-12, కస్తూరిబాయ్‌పేట్
విజయవాడ. ఫొన్ : 2434710

చప్రలు
రచన : చలపాక ప్రకాష్
వెల 15/-
పేజీలు : 63
ప్రతులకు : సి.హెచ్. కృష్ణప్రియ
1-4/3-36, సంజయ్ గాంధీ కాలనీ,
విద్యాధరపురం, విజయవాడ - 12



ప్రపంచీకరణ ప్రజల ప్రత్యామ్నాయాలు

ప్రపంచీకరణ అంటే ఏంటి? దానిలో దోషమేంటి? దానికి ఆచరణాత్మక, నిర్దిష్ట ప్రత్యామ్నాయాలు -పెగ్గియాంట్రోబస్, వాల్టెన్ బెల్లో, బ్యారీకోట్స్, వందన శివ, దేవేందర్ శర్మ లాంటి ప్రపంచీకరణ వ్యతిరేకోద్యమకారులు, సిద్ధాంతవేత్తల అభిప్రాయాలను క్రోడీకరించి అందించిన పుస్తకం 'ప్రపంచీకరణ-ప్రజల ప్రత్యామ్నాయాలు' జాన్ మెడెల్ రాశారు.



ప్రపంచీకరణ ప్రజల ప్రత్యామ్నాయాలు
జాన్‌మెడెల్
వెల రూ. 75/-, పేజీలు : 198,
ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచీలలో లభించును.

తృతీయ ప్రపంచ దేశాలు, పర్యావరణ అంశాలపై గత మూడు దశాబ్దాలకు పైగా కృషి చేస్తున్న ప్రముఖ రచయిత 1983-1998 వరకు 'ఇంటర్నేషనల్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్' పత్రిక ఎడిటర్‌గా పనిచేశారు. అబ్జర్వర్,గార్డియన్, ఫైనాన్షియల్ టైమ్స్ పత్రికల్లో వ్యాసాలు రాస్తుంటారు. 'హంగ్రీ ఫర్ ట్రేడ్'తో పాటు 'వెన్ ఎయిడ్ ఈజ్ నో హెల్ప్...' 'ట్రేడ్ అండ్ ది పూర్...','ల్యాండ్ ఈజ్ ది లైఫ్...','ట్రేడ్ అండ్ ది పూర్...','ల్యాండ్ ఈజ్ ది లైఫ్...', 'బిగ్ బిజినెస్, పూర్ పీపుల్...', 'ఫుడ్ ఫర్ ఆల్...' లాంటి గ్రంథాలనూ రచించారు.

ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్, చిక్కడపల్లి, హైదరాబాద్.

కోకోనట్ రైస్

కావలసిన వస్తువులు

బియ్యం	:	అరకిలో
కొబ్బరికాయ	:	ఒకటి
శనగపప్పు	:	ఒక టేబుల్ స్పూన్
మినప్పప్పు	:	ఒక టేబుల్ స్పూన్
ఆవాలు	:	అర టేబుల్ స్పూన్
జీలకర్ర	:	అర టేబుల్ స్పూన్
కరివేపాకు	:	ఎనిమిది రెబ్బలు
ఎండుమిర్చి	:	ఎనిమిది
జీడిపప్పు	:	25 గ్రాములు
ఉప్పు	:	తగినంత
నూనె	:	నాలుగు టేబుల్ స్పూన్స్
పసుపు	:	చిటికెడు

తయారుచేసే విధానం

ముందుగా బియ్యాన్ని పొడిపొడిగా ఉండేట్లు అన్నం వండుకోవాలి. కొబ్బరి చిప్పలను కోరుకోవాలి. అన్నాన్ని ఒక బేసిన్‌లో వేసి చల్లార్చుకోవాలి. పొయ్యిమీద బాండీ పెట్టి నూనె కాగాక ఎండుమిర్చివేసి వేగనివ్వాలి. తరువాత శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర, ఆవాలు వేసి వేగాక జీడిపప్పు వేయాలి. తరువాత కొబ్బరి వేసి కొద్దిసేపు వేయించి చివరగా పసుపు, ఉప్పు వేసి అన్నంలో కలపాలి.

రుచి

పొటాటో స్వీట్

కావలసిన వస్తువులు

బంగాళాదుంపలు	:	అర కిలో
పంచదార	:	350 గ్రాములు
నెయ్యి	:	350 గ్రాములు
పాలు	:	ఒక కప్పు

తయారుచేసే విధానం

ముందుగా బంగాళాదుంపలను ఉడికించుకొని తొక్కతీసి చిదిమి పాలుపోసి ముద్దగా కలిపి పక్కన పెట్టుకోవాలి. తరువాత ఒక మందపాటి గిన్నెలో పంచదార పోసి కప్పు నీరు పోసి పొయ్యి మీద పెట్టి తీగపాకం పట్టాలి. దీనిలో తయారుచేసి పెట్టుకున్న బంగాళాదుంప ముద్దను వేసి బాగా కలిసేలా జాగ్రత్తగా కలపాలి. దీనిని మైసూర్ పాక్ వలె నెయ్యి వేస్తూ కలుపుతూ ఉండాలి. ఇది గోధుమ రంగుకు వచ్చే వరకూ ఉడికించి దగ్గర పడుతుండగా నెయ్యి రాసిన పళ్ళెంలో వేసి సమంగా చేయాలి. మనకు నచ్చిన ఆకారంలో ముక్కలు కోసుకోవాలి.

- పి. జ్యోతి

పరిష్కారం

పెండెం జగదీశ్వర్



కమలకు తొమ్మిదేళ్లు. వాళ్ల అమ్మానాన్న రాళ్లు కొట్టి బ్రతుకుతారు. చాలా బీద కుటుంబం. కమల ఒక్కతే సంతానం. గారాబంగా చూసుకుంటారు. తమ కూతురిని బాగా చదివించాలని, పెద్ద డాక్టరును చేయాలని వారి కోరిక. కానీ కమల ఏనాడూ బడి ముఖం ఎరుగదు. ఒక్క అక్షరం ముక్క కూడా నేర్చుకోలేదు. కమల తల్లిదండ్రులు రాములు, యశోద దేశ సంచారులు. ఎక్కడ రాళ్లు కొట్టే పని దొరికితే అక్కడికి వెళతారు. ఊరికి దూరంగా గుట్టల దగ్గర నివాసం వుంటారు. అక్కడ పని లేకపోతే మరో ఊరికి పయనమవుతారు. ఎక్కడా నాలుగు నెలలు స్థిరంగా వుండరు. దాంతో కమలను చదివించడం పెద్ద సమస్యగా మారింది. చదివించాలన్న కోరిక వారికి, చదవాలన్న కోరిక కమలకు వున్నప్పటికీ పరిస్థితులు అందుకు వీలు కల్పించలేదు. దాంతో రాములు, యశోద లోలోపలే బాధపడుతుండేవారు. తల్లిదండ్రులు పనిచేస్తుంటే కమల చూస్తూ కాలం గడిపేది. తన వయసు పిల్లలంతా మంచి బట్టలు వేసుకుని బడికి వెళ్తుండడం చూసినప్పడల్లా కమల మనసు మూలిగేది. అలా రోజులు గడిచిపోతున్నాయి.

ఓరోజు రాములు, యశోద రాళ్లు కొడుతుండగా 'అమ్మా! నాన్నా! మన గుడిసె దగ్గరకు ఎవరో మాష్టారు వచ్చాడు. మీతో మాట్లాడాలంటున్నాడు' అంటూ పరుగెత్తుకుంటూ వచ్చి చెప్పింది కమల. 'ఏమై వుంటుందబ్బా?' అనుకుంటూ ఇద్దరూ గుడిసెకు చేరుకున్నారు. 'నా పేరు మల్లికార్జున్. బడికి వెళ్లలేకపోయిన పిల్లలకోసం మేం పక్క ఊర్లో ప్రత్యేకంగా ఒక క్యాంపు నిర్వహిస్తున్నాం. నాకు మీ కమల గురించి తెలిసింది. మీరు ఆమెను నాతో పంపిస్తే భోజనం పెట్టించి చదువు చెబుతాం' అన్నాడు అక్కడికొచ్చిన ఆ వ్యక్తి. రాములు, యశోద ఆలోచనలో పడ్డారు. కాని మల్లికార్జున్ మాటలు విన్న కమల ముఖంలో కొత్త ఉత్సాహం కనిపించింది.

'సార్! మేం ఏ ఊర్లో పట్టుమని పదిరోజులుండము. అందుకే మా కమలను చదివించలేకపోతున్నాం. ఇప్పడు మీతో పంపితే ఆమె చదువు కొనసాగుతుందంటారా?' అన్నాడు రాములు మల్లికార్జున్‌తో. 'మీరిక్కడ వున్నంతకాలం కమలను మాకు అప్పగించండి. ఆమెకు మొదటినుంచి చదువు నేర్పుతాం. ఆమె నేర్చుకున్న దాన్ని బట్టి ఏదో ఒక తరగతిలో చేర్చుతాం. మీరు వెళ్లే సమయం వస్తే అప్పటికి ఏదో ఒకటి చేద్దాంలే' అన్నాడు మల్లికార్జున్. 'నాన్నా! నేను బడికి వెళ్తా. నన్ను పంపించవూ!' అని బ్రతిమాలినట్టు అడిగింది కమల. కూతురు ఉత్సాహాన్ని వారు కాదనలేకపోయారు. ఒప్పకున్నారు. కమలను మల్లికార్జున్‌తో పంపారు.

క్యాంపులో కమలకు చాలా ఆనందంగా అనిపించింది. తనలాంటి చాలా మంది పిల్లలు అక్కడ చదువు నేర్చుకుంటున్నారు. ఇంతకాలం తాను కోల్పోయిన దానిని కమల అక్కడ పొందగలుగుతుంది. మాష్టారు చెప్పే పాఠాలను శ్రద్ధగా విన్నది. నెల రోజుల్లోనే కమలకు చదవడం, రాయడం వచ్చేసింది. ఆమెకు చదువు పట్ల వున్న ఆసక్తిని చూసి మాష్టార్లు కూడా సంతోషించారు. కమలను నాల్గవ తరగతిలో చేర్పించారు. రాములు, యశోద కూతురిని చూసిపోదామని వచ్చి కమల అభివృద్ధిని చూసి పొంగిపోయారు. మల్లికార్జున్‌కు కృతజ్ఞతలు చెప్పారు. కమల టకటకా పాఠం చదవడం, లెక్కలు చేయడం, బొమ్మలు గీయడం చూసి వారు ఆశ్చర్యపోయారు. ఆనందించారు. రోజులు గడిచిపోతున్నాయి.

ఓరోజు వాళ్లిద్దరూ మల్లికార్జున్ మాష్టారును కలిశారు. 'మాకీ ఊళ్లో పని అయిపోయింది. వేరే ఊరికి వెళ్లాలనుకుంటున్నాం. మీ దయవల్ల మా కమల ఇప్పటిదాకా బాగానే చదివింది. ఊరు మారితే ఆమె చదువేం అవుతుందోనని బెంగ పట్టుకుంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు!?' అన్నారు ఆందోళనగా.

మల్లికార్జున్ కొద్దిసేపు ఆలోచించి 'కమలను గురుకుల పాఠశాలలో చేర్పిద్దాం. అలాగైతే మీరెక్కడున్నా ఆమె చదువుకు ఇబ్బంది కలుగదు' అన్నాడు. కమల చేత గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష రాయించాడు. ఒక గురుకుల పాఠశాలలో కమలకు ఐదవ తరగతిలో సీటు వచ్చింది. రాములు, యశోద ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. 'మా అమ్మాయికి ఓ దారి చూపించారు మీరు. మీ మేలు ఎప్పటికీ మరువం. పరిష్కారం లేదనుకున్న కమల సమస్యకు మంచి మార్గాన్ని చూపించారు' అంటూ మల్లికార్జున్‌కు నమస్కరించాడు రాములు.

'నా ఉద్యోగ ధర్మం నేను చేశాను. చదవాలన్న కోరిక కమలలో బలంగా వుంది కాబట్టే ఇదంతా జరిగింది. ఈ ప్రపంచంలో పరిష్కారం లేని సమస్య అంటూ ఏదీ లేదు. కమల సమస్యకు ఇదో చక్కని పరిష్కారం. ఇకపై మీరు పనిమీద ఎంత దూరం వెళ్లినా సరే. కమల అదే పాఠశాలలో చదువుతుంది. మీకు చూడాలని అనిపించినప్పడల్లా వచ్చిపోండి. మీ కమలలాగా చదువుకుంటామన్న పిల్లలకు ప్రభుత్వం ఎన్నో సదుపాయాలు కల్పిస్తుంది. వాటిని వినియోగించుకుని బాగుపడాలి' అన్నాడు మల్లికార్జున్.

గురుకుల పాఠశాలలో కమల చదువు సాఫీగా సాగిపోతోంది. ఇప్పడు రాములుకు కూతురు చదువు గురించి ఏ బెంగా లేదు. క్లాసులో కమలది ఫస్టు ర్యాంకు.